thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

మహిళా క్రికెట్‌కు మరింత జోష్!



11

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 195 | జగిత్యాల మంగళవారం 27 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఐదు దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల సాగునీటి కలకు ఎట్టకేలకు మోక్షం లభించే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ముంబై వేదికగా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జరిపిన ఉన్నతస్థాయి చర్చలు సత్ఫలితాలనిచ్చాయి. తమ రాష్ట్రానికి నష్టం లేకుంటే పాత ఒప్పందాన్ని సవరించేందుకు సిద్ధమేనని ఫడ్నవీస్ భరోసా ఇవ్వడంతో పాటు.. క్షేత్రస్థాయి అధ్యయనానికి రెండు రాష్ట్రాల అధికారులతో ఉమ్మడి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం ప్రాజెక్టు సాధనలో చారిత్రక పరిణామంగా మారింది.



‘తుమ్మిడిహెట్టి‘కి లైన్ క్లియర్!

152 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తేనే ఆదిలాబాద్‌కు ప్రయోజనమన్న తెలంగాణ

బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర సానుకూలం

నష్టం లేకుంటే అభ్యంతరం లేదన్న దేవేంద్ర ఫడ్నవీస్

ముంబై భేటీలో ఫలించిన సీఎం రేవంత్ బృందం చర్చలు

మహారాష్ట్ర నిబంధనల ప్రకారమే ముంపు పరిహారం

అధ్యయనం కోసం రెండు రాష్ట్రాల అధికారులతో జాయింట్ కమిటీ ఏర్పాటు

ముంబై, అక్టోబర్ 26 : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించారు. సమావేశం ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

మిగతా 2 లో



బ్రిక్స్ వేదికపై తెలంగాణ గొంతుక!

- ఢిల్లీలో బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం భేటీ
- హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా

2

గ్రావిటీతో నీళ్లు తెస్తే.. రాజీనామా!

సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్

- కేసీఆర్‌కు పేరు వస్తుందనే మోటార్లు ఆపారు: హరీశ్‌రావు
- ఆయకట్టు లేని తుమ్మిడిహెట్టిపై రూ.25 వేల కోట్ల ఖర్చెందుకు?
- మంత్రి ఉత్తమ్‌కు ఓపెన్ ఛాలెంజ్.. రాజీనామాకు సిద్ధమా?



2

తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం అసాధ్యమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురాగలిగితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఒకవేళ తేలేకపోతే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా? అని ఆయన బహిరంగ సవాల్ విసిరారు.

వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్ రూ.5,016!



కేసముద్రం మార్కెట్‌లో ‘జై శ్రీరామ్’ రకానికి ఆల్ టైమ్ రికార్డ్

బహిరంగ మార్కెట్లో సన్నాలకు రూ.3,000-3,500

సర్కార్ మద్దతు ధరను దాటేసిన వడ్ల రేటు

రిటైల్ మార్కెట్‌లో కిలో సన్న బియ్యం రూ.90-100

.. వివరాలు 3లో



ఆ మాట మోదీతో చెప్పండి

వ్యాపారులకు రాహుల్ సూచన

.. వివరాలు 4లో



ఢిల్లీలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

రాష్ట్రపతి భవన్ సమీపంలో చెలరేగిన మంటలు

.. వివరాలు 4లో



ఖర్గే వ్యాఖ్యల దుమారం

దేశవ్యాప్తంగా బీజేపీ నిరసనలు

ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో భగ్గుమన్న కమలనాథులు

.. వివరాలు 4లో

కొమురం భీం పోరాటం చిరస్మరణీయం

జోడేఘాట్‌లో ఘన నివాళులు అర్పించిన మంత్రులు

బడ్జెట్‌లో గిరిజనాభివృద్ధికి నిధులు: మంత్రి అడ్లూరి

ఆత్మగౌరవానికి ప్రతీక భీం: మంత్రి దనసరి సీతక్క



వివరాలు 3లో..



నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?

సొంత సర్కార్‌పై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

30 వేల మందితో ఆమరణ దీక్షకు దిగుతా

జడ్పర్ల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్

3

ఏఈఈ అభ్యర్థులకు టీజీపీఎస్సీ ఊరట!

ఎస్ఎస్సీ జేఈ క్లాష్‌తో వెసులుబాటు

నవంబర్ 7న ఏఈఈ పరీక్షకు ఛాన్స్

3

సిరిసిల్ల ఆస్పత్రికి కేటీఆర్ భరోసా!

రూ.30 లక్షలతో వైద్య పరికరాల అందజేత

- సీఎస్ఆర్ నిధులతో కేటీఆర్ ప్రత్యేక చొరవ
- ఎన్‌హెచ్ఎం సిబ్బంది పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు
- అసెంబ్లీలో సమస్యలపై గళమెత్తుతామని హామీ

వివరాలు 3లో..



గ్రావిటీతో నీళ్లు తెస్తే.. నా పదవికి రాజీనామా!

సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్

కేసీఆర్‌కు పేరు వస్తుందనే మోటార్లు ఆపారు: హరీశ్‌రావు

ఆయకట్టు లేని తుమ్మిడిహెట్టిపై రూ.25 వేల కోట్ల ఖర్చెందుకు?

మంత్రి ఉత్తమ్‌కు ఓపెన్ ఛాలెంజ్.. రాజీనామాకు సిద్ధమా?

హైదరాబాద్, అక్టోబర్ 26 : రాష్ట్రంలో సాగునీటి నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నా, తాగు, సాగునీటి అవసరాలపై సర్కార్ కనీస శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా నీటిని సమర్థంగా తరలిస్తుంటే, తెలంగాణలో దేవాదుల నుంచి నీటిని ఎందుకు ఎత్తలేకపోయారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. దేవాదుల ప్రాజెక్టును సక్రమంగా నిర్వహించి ఉంటే వరంగల్, కరీంనగర్ జిల్లాల రైతులు ఇబ్బందులు పడేవారు కాదని హరీశ్‌రావు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులను వినియోగించడంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే దురుద్దేశంతోనే కన్నెపల్లి మోటార్లను ఆన్ చేయలేదని విమర్శించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారని, గతంలో ప్రాణహితఉచేవెళ్ల ప్రాజెక్టును దెబ్బతీసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన దుయ్యబట్టారు.



తుమ్మిడిహెట్టికి నీళ్లెక్కడివి? ఉత్తమ్ సిద్ధమా?

అధికారంలోకి వచ్చిన 1,054 రోజుల తర్వాత మహారాష్ట్రతో చర్చలకు వెళ్లడం విడ్డూరంగా ఉందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద తెలంగాణ వినియోగానికి తగిన నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, కానీ ఆయకట్టు లేని ప్రాజెక్టు కోసం ఏకంగా రూ.25 వేల కోట్లు ఖర్చు చేయడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం అసాధ్యమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తీసుకురాగలిగితే తాను తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఒకవేళ తేలేకపోతే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా? అని ఆయన బహిరంగ సవాల్ విసిరారు.

‘తుమ్మిడిహెట్టి‘కి లైన్ క్లియర్!

(మొదటి పేజీ తరువాయి..)

ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, గిరిజనుల ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం వల్లే గతంలో నక్సలిజం లాంటి సమస్యలు తలెత్తాయన్నారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975లో నాటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి నేటిదాకా జరిగిన ప్రయత్నాలను వివరించారు. 2016లో బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరినా.. ఆ ఎత్తుతో తెలంగాణ అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని స్పష్టం చేశారు. విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా గ్రావిటీ ద్వారా నీటిని తరలించాల్సి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమని వివరించారు. బ్యారేజీ ఎత్తు పెంపు వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు అక్కడి భూసేకరణ నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.

ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం

హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‘కు హాజరుకావాలని మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, కచ్చితంగా హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని ఆయన బదులిచ్చారు.



కొమురం భీమ్ ఆకాంక్షలు నెరవేరాలి: సీఎం రేవంత్

రెండు రాష్ట్రాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని, అక్కడి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఫడ్నవీస్ దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు. నాటినుంచి సాగు, తాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయం అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు భారీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధి అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు.

అధ్యయనానికి అధికారుల కమిటీ: ఫడ్నవీస్

తెలంగాణ ప్రతిపాదనలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని చెబుతూ.. తెలంగాణతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునఃసమీక్షించేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేస్తుందని సూచించారు. స్నేహభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందామని ఆయన పేర్కొన్నారు.

బ్రిక్స్ వేదికపై తెలంగాణ గొంతుక!

- ఢిల్లీలో 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం భేటీ
- హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా
- రాష్ట్ర ప్రగతిని వివరిస్తామన్న స్పీకర్ ప్రసాద్ కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 26 : ఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక బ్రిక్స్ సమావేశాల్లో తెలంగాణ గొంతును బలంగా వినిపిస్తామని శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతితో పాటు తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను ఈ అంతర్జాతీయ వేదికపై



సవివరంగా వివరిస్తామని ఆయన తెలిపారు. ఢిల్లీలోని సంవిధాన్ సదన్ (పాత పార్లమెంట్ భవనం)లో శని, ఆదివారాల్లో (26, 27 తేదీల్లో) జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ నుంచి స్పీకర్‌తో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు సైతం ఈ కీలక సమావేశాలకు హాజరయ్యారు.

అంతకుముందు ఈ బ్రిక్స్ సమావేశాలకు హాజరయ్యేందుకు ప్రసాద్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డిలు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టులో స్పీకర్ ప్రసాద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ఖ్యాతిని మరింత పెంచేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కాగా, స్పీకర్ ఢిల్లీ పర్యటన విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి!

డీజీపీ కార్యాలయంలో వేడుకల నిర్వహణ

మహర్షి చిత్రపటానికి అధికారుల నివాళులు

పాల్గొన్న డీజీ మహేష్ భగవత్, ఇతర సిబ్బంది



హైదరాబాద్, అక్టోబర్ 26 : డీజీపీ కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పోలీసు అధికారులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, భారతీయ సాహిత్యానికి, ఆధ్యాత్మికతకు ఆయన అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. చెడు నుంచి సన్మార్గం వైపు పయనించి సమాజానికి మానవతా విలువలను చాటిచెప్పిన ఆయన జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, ఏఐజీ (అడ్మిన్) జె.అన్యోన్య, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వర రావు, పేషీ డీఎస్పీ భాస్కర్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్రం భీమ్ ఆశయాలు సాధించాలి!

నివాళులర్పించిన ప్రత్యేక కార్యదర్శి సంతోష్

హైదరాబాద్, అక్టోబర్ 26 : కుమ్రం భీమ్ వర్ధంతిని (మంగళవారం) పురస్కరించుకుని హైదరాబాద్‌లోని నెహ్రూ శతజయంతి గిరిజన మ్యూజియంలో సోమవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, సంచాలకుడు సంతోష్ బి.ఎం ముఖ్య అతిథిగా హాజరై.. భీమ్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. జల్, జంగల్, జమీన్ కోసం ఆయన చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే నేటి ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తున్నాయని సంతోష్ చెప్పారు. గిరిజన బాలబాలికలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు, కనీస మౌలిక వసతులు కల్పించడం ద్వారానే కుమ్రం భీమ్ ఆశయాలను నెరవేర్చగలమని పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన దిశగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకుడు వి.సర్వేశ్వర రెడ్డి, టీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ వి.సముజ్వల, మ్యూజియం సంరక్షకుడు డాక్టర్ సత్యనారాయణ ద్యావనపల్లి, సీఈ బాలు, ఎస్సీ హేమలత, సహ సంచాలకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.





మహిళలకు ‘మహాలక్ష్మి‘ వరం!

రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్న వనితలు

28 నెలల్లో 290 కోట్ల ఉచిత ప్రయాణాలు

రోజు 35 లక్షల మందికి ఉచిత ప్రయాణం

98 శాతానికి చేరిన బస్సుల ఆక్యుపెన్సీ రేటు

హైదరాబాద్, అక్టోబర్ 26 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళలకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూర్చింది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు ఏకంగా రూ.10 వేల కోట్లకు పైగా ఆదా చేసుకున్నట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 28 నెలల కాలంలో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదైనట్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా గతంలో ఉన్న 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరగడంతో బస్సుల ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి ఏకంగా 98 శాతానికి చేరుకోవడం గమనార్హం.

మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించినట్లు ప్రభుత్వం గుర్తుచేసింది. ఈ పథకం ద్వారా మహిళల రోజువారీ రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గాయని పేర్కొంది. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణానికి మాత్రమే పరిమితం కాదని, మహిళల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వావలంబనకు ప్రతీక అని అభివర్ణించారు. విద్య, ఉపాధి కోసం మహిళలు ఆర్థిక భారం లేకుండా ప్రయాణించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. కాగా, పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు టీజీఎస్ఆర్టీసీ చర్యలు చేపడుతోందని సీఎం వెల్లడించారు.



ఇన్‌స్టాలో వల.. నకిలీ ‘మూన్ బేబీ‘ లీలలు!

- అమ్మాయి పేరుతో ఫేక్ ప్రొఫైల్ సృష్టి
- డాక్టర్లు, పోలీసులు సహా విదేశీయులకూ ఎర
- బీటెక్ విద్యార్థిపై లైంగిక దాడి, బ్లాక్‌మెయిల్
- నిందితుడు పవన్‌కుమార్‌పై దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్, అక్టోబర్ 26 : సైదాబాద్ పరిధిలో వెలుగుచూసిన హనీట్రాప్ కేసు విచారణలో నిందితుడు పవన్ కుమార్ ఆగడాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ‘వీశీశీఅ ఎుఎఎ 5973’ పేరుతో అమ్మాయిగా నకిలీ ప్రొఫైల్ సృష్టించి దేశవిదేశాల్లోని యువకులకు వల వేసినట్లు పోలీసుల కస్టడీలో వెల్లడైంది. మల్లారెడ్డి కాలేజీకి చెందిన ఓ బీటెక్ విద్యార్థికి దగ్గరై అతడిపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా, తన మాట వినకపోతే ఆత్మహత్య చేసుకుని కేసులో ఇరికిస్తానని బెదిరించినట్లు విచారణలో తేలింది.

దేశాలు దాటిన మోసాలు..

నిందితుడి ఫోన్, సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించగా ఈ మోసాల వల తెలుగు రాష్ట్రాలకే కాకుండా కర్ణాటక, కేరళ, తమిళనాడు సహా పాకిస్థాన్, టర్కీ, కెనడా వంటి దేశాలకూ విస్తరించినట్లు వెల్లడైంది. ఇతడి వలలో చిక్కుకున్న వారిలో వైద్యులు, పోలీసు సిబ్బంది, వ్యాపారవేత్తలు, లెక్చరర్లు, డెలివరీ బాయ్స్ కూడా ఉండటం గమనార్హం.

ప్రైవేట్ వీడియోలతో బెదిరింపులు..

మాయమాటలతో పరిచయాలు పెంచుకుని ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు సేకరించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూ నిందితుడు భారీగా డబ్బు వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయి. కొన్ని వీడియోలను ఇతర ఖాతాల్లోనూ అప్‌లోడ్ చేశాడు. గతంలో కపిల్ చిట్ ఫండ్స్‌లో పనిచేసినప్పుడు రుణాల పేరుతో ఓ సహోద్యోగిని సైతం మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఇంకెంతమంది బాధితులు ఉన్నారనే కోణంలో సైదాబాద్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కొమురం భీం పోరాటం చిరస్మరణీయం!

- జోడేఘాట్‌లో అమరుడు భీమ్‌కు ఘన నివాళులు అర్పించిన మంత్రులు
- ఐటీడీఏలకు పూర్వ వైభవం.. బడ్జెట్‌లో గిరిజనాభివృద్ధికి నిధులు: మంత్రి అడ్లూరి
- ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక కొమురం భీం: మంత్రి దనసరి సీతక్క

జల్, జంగల్, జమీన్ ఆశయ సాధనకు సమష్టిగా కృషి చేయాలి



కెరమెరి, అక్టోబర్ 26 : ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పోరాడిన అమరుడు కొమురం భీం త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, మహిళాఉశిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క కొనియాడారు. సోమవారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహించిన కొమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమంలో మంత్రులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం కొమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాబోయే బడ్జెట్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. గిరిజన జీవోల అమలుకు త్వరలో పూర్తి స్థాయి అధికారిక ఉత్తర్వులు జారీ చేసే బాధ్యతను గిరిజన సంక్షేమ శాఖ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఐటీడీఏలకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతాల్లో ఆదివాసీలు, గిరిజనులకు అందుతున్న సంక్షేమ ప్రయోజనాలను అధ్యయనం చేసేందుకు అధికారుల కమిటీని పంపిస్తామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలకు ప్రాధాన్యం..

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరీత మాట్లాడుతూ.. ప్రతి గిరిజన గ్రామానికి నిరంతరం తాగునీరు అందించేందుకు కెరమెరి సమీపంలో రూ.60 కోట్లతో ఇంటెకెవెల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎస్పీ నిఖితా పంత్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉట్నూర్ ఐటీడీఏ పీఓ మంద మకరందు గోండి భాషలో ప్రసంగించి గిరిజన ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందజేశారు. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్, వెడ్మా బొజ్జు పటేల్, భీం మనుమడు కొమురం సోనేరావు, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అధికారులు మానవత్వంతో వ్యవహరించాలి: సీతక్క

మంత్రి దనసరి సీతక్క మాట్లాడుతూ, జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన వీరుడు కొమురం భీం ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే అధికారులు మానవత్వంతో, అంకితభావంతో వ్యవహరించాలని, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. యువత విద్యపై దృష్టి సారించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ జిల్లాలో సుమారు 8 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, గిరిజన ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి రూ.5 కోట్లు, రహదారుల అభివృద్ధికి రూ.180 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు గిరిజనులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు.

నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?

సొంత సర్కార్‌పై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫైర్

మంత్రుల నియోజకవర్గాలకే నిధులు ఇస్తారా?

30 వేల మందితో ఆమరణ దీక్షకు దిగుతా

జడ్చర్ల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్



మహబూబ్‌నగర్, అక్టోబర్ 26 : తెలంగాణలో సొంత కాంగ్రెస్ ప్రభుత్వంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పనులు పూర్తయినా బిల్లులు విడుదల చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు. తనకు రావాల్సిన బిల్లుల కోసం తాను చనిపోవాల్సిందేనా అని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు.

మంత్రుల నియోజకవర్గాలకేనా?

అనిరుధ్‌రెడ్డి సోమవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, గుండ్లపోట్లపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రుల నియోజకవర్గాల్లోనే బిల్లులు చెల్లిస్తారా? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోతే వెంటనే రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తన నియోజకవర్గంలో బిల్లులు రావాలంటే తాను కూడా ప్రాణాలు కోల్పోవాలా అని అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి చేసినప్పుడే ప్రభుత్వం నిలదొక్కుకుంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జడ్చర్లకు సాగునీరు అందించే విషయంలో పార్టీలకు అతీతంగా పోరాడతానని, రైతుల ప్రయోజనాల కోసం ఎంతదూరమైనా వెళతానని తేల్చిచెప్పారు. పెండింగ్ బిల్లుల విడుదలతో పాటు నియోజకవర్గానికి రావాల్సిన నిధులపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని అనిరుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

వడ్లకు రికార్డు ధర.. క్వింటాల్ రూ.5,016!

- కేసముద్రం మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకానికి ఆల్ టైమ్ రికార్డ్
- బహిరంగ మార్కెట్లో సన్నాలకు రూ.3,000-3,500
- సర్కార్ మద్దతు ధరను దాటేసిన వడ్ల రేటు
- రిటైల్ మార్కెట్‌లో కిలో సన్న బియ్యం రూ.90-100



హైదరాబాద్, అక్టోబర్ 26 : తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో కళ్లుచెదిరే ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం 'జై శ్రీరామ్' రకం ధాన్యం క్వింటాలుకు ఏకంగా రూ.5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోనూ సన్న రకం ధాన్యానికి రూ.3,000 నుంచి రూ.3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గినట్లు అంచనాలున్నాయి. ఎల్‌నినో ప్రభావం ఆందోళనలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి ప్రైవేటు వ్యాపారులు, రైస్ మిల్లర్లు కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటం రేట్ల పెరుగుదలకు కారణమైంది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్‌లో పోటీ పెరిగి ధరలు ఎగబాకుతున్నాయి. 'జై శ్రీరామ్'తో పాటు ఆర్ఎన్ఆర్ లాంటి సన్న రకాలకూ క్వింటాలుకు రూ.4,300 వరకు ధర పలుకుతోంది. ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461 మద్దతు ధర ప్రకటించింది. ఎంపిక చేసిన ఏడు సన్న రకాలపై రూ.500 బోనస్ కలిపినా రైతుకు గరిష్ఠంగా రూ.2,961 మాత్రమే అందుతుంది. అయితే బహిరంగ మార్కెట్‌లో ధర రూ.3,500 పైనే పలుకుతుండటంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రజా పంపిణీ వ్యవస్థకు (రేషన్) అవసరమైన సన్న బియ్యాన్ని సేకరించడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. ధాన్యం ధరలు పెరగడం రైతులకు లాభదాయకంగా ఉన్నా, బియ్యం కొనుగోలు చేసే సామాన్య వినియోగదారులపై మాత్రం తీవ్ర భారం పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న బియ్యం ధర కిలో రూ.90 నుంచి రూ.100 వరకు చేరింది. కాగా, సన్న వడ్ల సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చినా.. ఇప్పుడు రైతులకు మేలు జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో కోతలు పూర్తయి ధాన్యం సరఫరా పెరిగితే ధరలు ఎలా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఏఈఈ అభ్యర్థులకు టీజీపీఎస్సీ ఊరట!

ఎస్ఎస్సీ జేఈ క్లాష్‌తో వెసులుబాటు

నవంబర్ 7న ఏఈఈ పరీక్షకు ఛాన్స్

అక్టోబర్ 30లోగా పత్రాల సమర్పణ

ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు


హైదరాబాద్ : తెలంగాణలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) భారీ ఊరటనిచ్చింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) జూనియర్ ఇంజనీర్ (జేఈ) పరీక్ష, ఏఈఈ పరీక్ష ఒకే రోజు ఉండటంతో ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులకు ప్రత్యామ్నాయ తేదీని కల్పించింది. నవంబర్ 6న ఎస్ఎస్సీ జేఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండి, ఏఈఈ పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్న అర్హులకు.. నవంబర్ 7న పరీక్ష రాసేందుకు కమిషన్ సదావకాశం కల్పించింది. ఈ వెసులుబాటు పొందాలనుకునే అభ్యర్థులు అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమకు సంబంధించిన అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 6వ తేదీతో ఉన్న ఎస్ఎస్సీ జేఈ హాల్‌టికెట్ కాపీ, ఏఈఈ దరఖాస్తు పత్రం, టీజీపీఎస్సీ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) ఐడీ తదితర వివరాలను అందించాలి. ఈ పత్రాలను కమిషన్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో నేరుగా అందజేయవచ్చు. లేదా ప్లవశ్రీజూనవంఎన్స్రజూంఎ.స్రశీజ.అఅ ఈమెయిల్ చిరునామాకు కూడా పంపించే వీలుందని కమిషన్ తెలిపింది.

అర్హులైన వారికే అవకాశం..

అభ్యర్థులు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అర్హులైన వారికే నవంబర్ 7న ఏఈఈ పరీక్ష రాసేందుకు అనుమతి లభిస్తుంది. నవంబర్ 6న ఎస్ఎస్సీ జేఈ పరీక్షకు హాజరుకావాల్సి ఉండి, ఏఈఈ పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్నవారికే ఈ అవకాశం వర్తిస్తుంది. ఎస్ఎస్సీ జేఈ (సివిల్) పరీక్షలు నవంబర్ 2 నుంచి 6 వరకు, టీజీపీఎస్సీ ఏఈఈ (సివిల్) పరీక్షలు నవంబర్ 6, 7 తేదీల్లో జరగనున్నాయి. రెండు పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తేదీల పరంగా ఎదురైన తీవ్ర ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న టీజీపీఎస్సీ ఈ నిర్ణయం తీసుకుంది. కాబట్టి అర్హులైన అభ్యర్థులు గడువులోగా పత్రాలు సమర్పించుకోవాలని సూచించింది.

సిరిసిల్ల ఆస్పత్రికి కేటీఆర్ భరోసా!

- రూ.30 లక్షలతో వైద్య పరికరాల అందజేత
- సీఎస్ఆర్ నిధులతో కేటీఆర్ ప్రత్యేక చొరవ
- ఎన్‌హెచ్ఎం సిబ్బంది పోరాటానికి బీఆర్ఎస్ మద్దతు
- అసెంబ్లీలో మీ సమస్యలపై గళమెత్తుతామని హామీ



సిరిసిల్ల, అక్టోబర్ 26 : సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా దాదాపు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు సమకూరాయి. ఈ పరికరాలను ఆయన సోమవారం ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దవాఖానకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేటీఆర్ ఈ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల దవాఖానలో వైద్య సదుపాయాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ దవాఖానల నిర్వహణ, గతంలో కల్పించిన సదుపాయాల పరిరక్షణపై నిర్లక్ష్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో హాస్పిటల్‌కు వచ్చే రోగుల అవసరాలను గుర్తించి సీఎస్ఆర్ నిధుల ద్వారా సుమారు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వైద్య పరికరాలను సమర్థవంతంగా వినియోగిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని స్థానికులు ఆశిస్తున్నారు.

ఎన్‌హెచ్ఎం సిబ్బందికి బీఆర్ఎస్ మద్దతు..

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు రెండు వారాలుగా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు, నిరసనలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో జిల్లాలో పనిచేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడిన ఆయన.. కరోనా సమయంలో సిబ్బంది అందించిన సేవలను అభినందించారు. ఉద్యోగుల డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని పేర్కొంటూ వారి పోరాటానికి బీఆర్ఎస్ నైతిక మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పీఆర్సీ ప్రయోజనాలు కల్పించామని గుర్తు చేశారు. ఎన్‌హెచ్ఎం రాష్ట్ర కమిటీ నాయకుల డిమాండ్ల అంశాలు పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చించి పరిష్కారం కోసం బీఆర్ఎస్ తరఫున ఏం చేయగలమో స్పష్టంగా తెలియజేస్తామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులు తమ పోరాటాన్ని కొనసాగించాలని, ప్రభుత్వం స్పందించేలా ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను వివరించాలని కేటీఆర్ సూచించారు.

ఖర్గే భాష విచారకరం!

ప్రధానిపై వ్యాఖ్యలను ఖండించిన రాంచందర్‌రావు



హైదరాబాద్, అక్టోబర్ 26 : ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఖండించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత నుంచి ఇలాంటి భాష రావడం అత్యంత విచారకరమని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దశాబ్దానికి పైగా అధికారానికి దూరంగా ఉండటంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత పన్నెండున్నరేళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో నిరాశ పెరిగిపోయిందని ఆరోపించారు. ఆ అసంతృప్తితోనే మోదీ కుటుంబాన్ని ఉద్దేశించి ఖర్గే అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఖర్గే ప్రసంగించిన సభలో వేదికపై ఉన్న నేతల సంఖ్యతో పోలిస్తే ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఎద్దేవా చేశారు. బిహార్ రాజధాని పాట్నాలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఖర్గే ప్రసంగిస్తుండగా, మోదీ ఓడిపోరంటూ ఓ వ్యక్తి నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' అంటూ వ్యాఖ్యానించడం వివాదానికి దారితీసింది. ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు చేయడంతో రెండు పార్టీల మధ్య రాజకీయ విమర్శలు మరింత తీవ్రమయ్యాయి.

సంపాదకీయం



భారీ యుద్ధాల కోసం 'కోట' కడుతోన్న అమెరికా!

యుద్ధ వేళల్లో 90 రోజుల పాటు స్వతంత్రంగా పనిచేసేలా సైనిక స్థావరాలు

విద్యుత్ కోసం పోర్టబుల్ అణు రియాక్టర్లు, భారీ బ్యాటరీ వ్యవస్థలు

రక్షణ రంగ తయారీకి పౌర ఫ్యాక్టరీల వినియోగం

పశ్చిమాసియాతో పాటు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో భారీ యుద్ధాలు తలెత్తినా, తన భూభాగాన్ని రక్షించుకోవడంతో పాటు సైనిక కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అమెరికా సన్నద్ధమవుతోంది. యుద్ధ సమయాల్లో సరఫరా గొలుసులు, పౌర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నప్పటికీ సైనిక స్థావరాలు కనీసం 90 రోజుల పాటు స్వతంత్రంగా పనిచేసేలా 'ఫోర్ట్రెస్' పేరుతో ఓ ప్రణాళికను అమలు చేసేందుకు పెంటగాన్ చర్యలు వేగవంతం చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఓ కథనాన్ని ప్రచురించింది. దేశ రక్షణ కోసం సాధారణ పౌర మౌలిక సదుపాయాలపై ఆధారపడటం ప్రమాదకరమని పెంటగాన్ ముఖ్య అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ పేర్కొన్నట్లు ఆ కథనం వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్తు అత్యంత కీలకంగా మారిందని, విద్యుత్ సరఫరా నిలిచిపోతే సమాచార వ్యవస్థలతో పాటు రవాణా సదుపాయాలపైనా ప్రభావం పడుతుందని ఆయన వివరించినట్లు తెలిపింది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకే 'ఫోర్ట్రెస్' ప్రణాళికను రూపొందిస్తున్నట్లు పేర్కొంది. అమెరికా భూభాగ రక్షణకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త విధానాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, 'గోల్డెన్ డోమ్', 'ఫోర్ట్రెస్' ప్రణాళికలు అందులో భాగమని పార్నెల్ వెల్లడించినట్లు కథనం పేర్కొంది. 'ఫోర్ట్రెస్' ప్రణాళికలో భాగంగా అమెరికా వ్యాప్తంగా కీలక సైనిక స్థావరాలను మరింత స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కనీసం 90 రోజుల పాటు బయటి సరఫరాలపై ఆధారపడకుండా కీలక కార్యకలాపాలను కొనసాగించేలా వీటిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం పోర్టబుల్ అణు రియాక్టర్లు, భారీ సామర్థ్యం కలిగిన బ్యాటరీ వ్యవస్థలు, స్థానికంగా విద్యుత్ ఉత్పత్తి చేసి పంపిణీ చేయగల మైక్రోగ్రిడ్‌లను వినియోగించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. యుద్ధ సమయంలో ఆయుధాలు, ఇంధనం, వైద్య సామగ్రి, కీలక ఖనిజాలు, విడిభాగాల కొరత ఏర్పడినా సైనిక కార్యకలాపాలు ఆగిపోకుండా ఏర్పాట్లు చేయడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. సరఫరా మార్గాలు దెబ్బతిన్నా, విద్యుత్ వ్యవస్థలు నిలిచిపోయినా సైనిక స్థావరాలు తమ కార్యకలాపాలను కొనసాగించే సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో రక్షణ రంగానికి అవసరమైన వస్తువులను తయారు చేసేందుకు పౌర పరిశ్రమలను కూడా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఫ్యాక్టరీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, అవసరమైన సాంకేతిక మార్పులు చేయడం, సైబర్ భద్రతను బలోపేతం చేయడం వంటి అంశాలపై పెంటగాన్ దృష్టి సారించినట్లు కథనం పేర్కొంది. యుద్ధ పరిస్థితుల్లో సైనిక సామర్థ్యం కేవలం ఆయుధాలకే పరిమితం కాదని, విద్యుత్, ఇంధనం, సమాచార వ్యవస్థలు, వైద్య సేవలు, పారిశ్రామిక ఉత్పత్తి వంటి రంగాలూ కీలక పాత్ర పోషిస్తాయని అమెరికా భావిస్తున్నట్లు ఈ ప్రణాళిక సూచిస్తోంది. అయితే 'ఫోర్ట్రెస్' ప్రణాళికకు సంబంధించిన పూర్తి అమలు వివరాలు, స్థావరాల ఎంపిక, నిధుల కేటాయింపు, గడువులపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

మోదీతో ఆ మాట చెప్పండి

- **30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయి!**
- **వ్యాపారులకు రాహుల్ గాంధీ సూచన..**
- **'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబరు 1న 'ఇండియా' కూటమి ఆందోళన**

న్యూదిల్లీ, అక్టోబర్ 26: 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా నవంబరు 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసనను వాయిదా వేయాలని స్థానిక వ్యాపార వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. దీపావళి పండగ సీజన్‌లో ఆందోళన నిర్వహిస్తే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశాయి. ఈ విజ్ఞప్తిపై రాహుల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరితే నిరసనలు ఆగిపోతాయని వ్యాఖ్యానించారు. "దిల్లీలోని ప్రతి వ్యాపారి మాటను వింటున్నాం. వారి సమస్యలను అర్థం చేసుకుంటున్నాం. అయితే మెట్రోలను ప్రభుత్వమే నిలిపివేసింది. రోడ్లనూ మూసివేసింది. దేశ రాజధానిని లాక్‌డౌన్‌లో ఉంచింది. ఓట్లనే చోరీ చేస్తే.. ఇక మీ దుకాణాలు, పొదుపు సొమ్ము, పిల్లల భవిష్యత్తు.. ఏదీ సురక్షితం కాదు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పండి. అప్పుడు 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ఆగిపోతాయి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీపావళి పండగ సమయంలో దిల్లీలో పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు జరుగుతాయని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) తెలిపింది. నవంబరు 1న రామ్‌లీలా మైదానంలో నిరసన నిర్వహిస్తే పరిసర ప్రాంతాల్లోని వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిరసన కారణంగా దాదాపు రూ.10 వేల కోట్ల వ్యాపారం ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో నవంబరు 10 తర్వాత నిరసనను నిర్వహించాలని కోరుతూ రాహుల్ గాంధీకి లేఖ రాసినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. పండగ సీజన్‌లో



వినియోగదారుల రాకపోకలు, వ్యాపార లావాదేవీలకు ఆటంకం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశాయి. మరోవైపు, ఓటు చోరీ ఆరోపణలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు.

అమిత్ షా పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

ఆరేళ్ల నాటి కేసులో నిర్దోషిగా ప్రకటించిన సుల్తాన్‌పూర్ కోర్టు

2018 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలతో వివాదం

సుల్తాన్‌పూర్, అక్టోబర్ 26: కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా వెల్లడించారు. తీర్పు వెలువడే సమయంలో రాహుల్ గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 2018 మే 8న బెంగళూరులో జరిగిన సభలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. అదే ఏడాది ఆగస్టు 4న బీజేపీ నేత, జిల్లా సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని 2023 నవంబర్ 27న కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. 2024 ఫిబ్రవరి 20న కోర్టుకు హాజరైన ఆయనకు బెయిల్ లభించింది. అదే ఏడాది జూలై 26న రాహుల్ వాంగ్మూలాన్ని, అక్టోబర్ 9న ఫిర్యాదుదారు విజయ్ మిశ్రా వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. 2025 ఫిబ్రవరి 28న ఫిర్యాదుదారు తరఫు సాక్షి అనిల్ మిశ్రా వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అదే ఏడాది డిసెంబర్ 8న మరో సాక్షి రామచంద్ర దూబే వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసింది. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 20న రాహుల్ గాంధీ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన వాయిస్ శాంపిల్స్‌ను సరిపోల్చాలని విజయ్ మిశ్రా దాఖలు చేసిన పిటిషన్‌ను మేజిస్ట్రేట్ కోర్టు మార్చి 12 తర్వాత విచారించి తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, జూలై 15న అక్కడా చుక్కెదురైంది. సెప్టెంబర్ 10న హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ కూడా తిరస్కరణకు గురైంది. అక్టోబర్ 6న కేసులో తుది వాదనలు ప్రారంభమై, అక్టోబర్ 12 నాటికి విచారణ పూర్తయింది. అనంతరం సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించినట్లు ఆయన న్యాయవాది తెలిపారు. దీంతో 2018లో ప్రారంభమైన పరువు నష్టం కేసు సుదీర్ఘ విచారణకు ముగింపు లభించింది.

ఖర్గే వ్యాఖ్యల దుమారం

దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల నిరసనలు!

- **ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో భగ్గుమన్న కమలనాథులు**
- **కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని, క్షమాపణ చెప్పాలని కమలదళం డిమాండ్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఈ వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) శ్రేణులు దేశవ్యాప్తంగా అగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టాయి. ప్రధాని మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీజేపీ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ఖర్గే వెంటనే తన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని, ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఖర్గే తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలంటూ కమలనాథులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు., ప్రధాని





మోదీకి ఖర్గే బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మల్లికార్జున ఖర్గే మాట్లాడుతు.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో ఓ కార్యక్రమానికి హాజరైన మల్లికార్జున ఖర్గే.. 'మోదీ కాదు.. ఆయన బాబైనా పోవాల్సిందే' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై కాషాయ పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో భగ్గుమన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల ఎదుట ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ ప్రధాన కార్యాలయాల్లో ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట్ల ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేయడంతో పాటు, ఆయన పోస్టర్లకు నిప్పంటించి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖర్గే దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఆయన పోస్టర్లకు నిప్పంటించి, వ్యతిరేక నినాదాలు చేశారు. ముఖ్యంగా బిహార్‌వ్యాప్తంగా కమలనాథులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. బిహార్‌లో కమలనాథులు ఆందోళనలు నిర్వహించి, కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విమర్శించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్:

ఈ వివాదంపై బీజేపీ అగ్ర నాయకులు తీవ్రంగా స్పందించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా తప్పుపట్టారు. "ఇది అత్యంత బాధాకరమైన విషయం. ఈ మొత్తం వ్యవహారంలో నన్ను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిన అంశం ఏమిటంటే.. ఈ తరహా చౌకబారు వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని ఏదో చిన్న స్థాయి నాయకుడు చేయలేదు, ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడే చేయడం బాధ్యతారాహిత్యం" అని రాజ్‌నాథ్ సింగ్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. 'ఇది చాలా బాధాకరం. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయం ఏంటంటే.. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్‌లో చిన్న స్థాయి వ్యక్తి చేయలేదు. ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఢిల్లీలో నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం

రాష్ట్రపతి భవన్ సమీపంలో చెలరేగిన మంటలు

దట్టమైన పొగలు వ్యాపించడంతో అప్రమత్తమైన అధికారులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: దేశ రాజధానిలోని అత్యంత కీలకమైన ప్రభుత్వ భవనాల్లో ఒకటైన నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాష్ట్రపతి భవన్‌కు సమీపంలో మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ ఆరు వాహనాలను ఘటనా స్థలానికి పంపించింది. పార్లమెంట్‌కు వెళ్తున్న సమయంలో నార్త్ బ్లాక్ వెనుక వైపు నుంచి దట్టమైన పొగలు వెలువడటాన్ని గమనించినట్లు రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవరా తెలిపారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడిస్తూ, అక్కడ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. అందరూ క్షేమంగా ఉండాలని, అత్యవసర సేవలు వేగంగా స్పందించాలని ఆకాంక్షించారు. పొగలు కనిపిస్తున్న ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు. ప్రమాద తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. మంటలు చెలరేగడానికి గల కారణాలు, అవి అదుపులోకి వచ్చాయా లేదా అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా, భవనానికి ఎంత మేర నష్టం వాటిల్లిందనే అంశాలపై కూడా అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. అగ్నిమాపక సిబ్బంది పరిశీలన అనంతరం మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.



జామియా విద్యార్థుల దీక్షకు పాక్షికంగా తెర

విద్యార్థి సంఘం ఎన్నికలకు యూనివర్సిటీ అంగీకారం

సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసుల ఉపసంహరణకు నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీలో విద్యార్థుల నిరాహార దీక్షకు పాక్షికంగా తెరపడింది. విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లపై యూనివర్సిటీ యాజమాన్యం అక్టోబర్ 26, 2026న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం, ఆందోళన సందర్భంగా విధించిన సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవడం, భద్రతా సిబ్బంది వ్యవహారంపై విచారణ చేపట్టడం వంటి నిర్ణయాలను ప్రకటించింది. అయితే, ఎన్నికల పోలింగ్ తేదీ ఖరారు కాకపోవడంతో కొందరు విద్యార్థులు నిరసన కొనసాగిస్తున్నారు. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌కు యూనివర్సిటీ అంగీకరించింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.డి. మెహతాబ్ ఆలం రిజ్వీ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన 15 రోజుల తర్వాత ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఆ రాజ్యాంగానికి ఎప్పుడు ఆమోదం లభిస్తుందనే దానిపై స్పష్టత లేదు. దీంతో పోలింగ్ తేదీని ఇంకా ప్రకటించలేదు. ఆందోళన సమయంలో విద్యార్థులపై విధించిన సస్పెన్షన్లను రద్దు చేయడంతో పాటు జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని యూనివర్సిటీ నిర్ణయించింది. అదే సమయంలో, యాజమాన్యానికి పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు, చర్యలు, సోషల్ మీడియా పోస్టులపై విద్యార్థులు బహిరంగంగా క్షమాపణ చెప్పేందుకు అంగీకరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం, సంబంధిత పోస్టులను తొలగించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. విద్యార్థుల నిరసన సమయంలో భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరుపై విచారణ జరిపేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని కూడా యాజమాన్యం నిర్ణయించింది. యూనివర్సిటీ నిర్ణయాలపై కొంతమంది విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, పోలింగ్ తేదీని ఖరారు చేయకపోవడంపై అభ్యంతరం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గేట్ నంబర్ 7 వద్ద టెంట్లు వేసుకుని నిరసన కొనసాగిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చేవరకు ఆందోళన విరమించబోమని చెబుతున్నారు. విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన తర్వాతే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన 15 రోజుల గడువు ప్రారంభం కానుంది. దీంతో రాజ్యాంగం ఆమోదం, ఎన్నికల షెడ్యూల్ ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది.

నూతనంగా ఎన్నికైన మక్క రాజుపేట గౌడ సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యులకు ఘన సన్మానం



దుబ్బాక ప్రతినిధి (చేగుంట), అక్టోబర్ 26, :

చేగుంట మండలంలోని మక్కరాజుపేట గౌడ సంఘానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు రమేష్ గౌడ్, కోశాధికారి రాయలపురం ముత్యాల గౌడ్, కార్యదర్శులు బాల్ శెట్టి నాగరాజు గౌడ్, కుసంగి సురేష్ గౌడ్ లను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాయవాది డీఆర్‌టీ కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్, హ్యూమన్ రైట్స్, ఆర్టిఐ శాఖల రాష్ట్ర వైస్ చైర్మన్ బాల్ శెట్టి సంజయ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం గౌడ సంఘం అభివృద్ధికి, గౌడ కులస్తుల ఐక్యతకు, సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘం సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ సామాజిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాల్ శెట్టి సాయగౌడ్, శంకర్ గౌడ్, బాల్ శెట్టి నర్సింలు గౌడ్, మెదక్ రమాకాంత్ గౌడ్, బాల్ శెట్టి రమేష్ గౌడ్, బాల్ శెట్టి నరేష్ గౌడ్, రాయలపురం రామకృష్ణ గౌడ్, బుర్ర వెంకట్ గౌడ్, బాల్ శెట్టి భరత్ గౌడ్, కుశంగి శ్రీనివాస్ గౌడ, పూజారి లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో రెండు దరఖాస్తులు



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 26, :

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిరుదొడ్డి ఎంపీడీవో వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలానికి సంబంధించి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి వేదికగా దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

- 14 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా ధూళ్‌మిట్ట మండలం జాలపల్లి గ్రామానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం పలువురు తమ సమస్యలను ఎంపీ, కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, సర్పంచులు కరుణాకర్, కొమ్ము రవి, కొమ్ము నర్సింగరావు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- ధర్మబద్ధమైన మార్గంలో పయనించాలి
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

ఆది కావ్యమైన రామాయణాన్ని రచించి ప్రపంచానికి ధర్మమార్గాన్ని బోధించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని మంచి మార్గంలో నడవాలని ఆమె సూచించారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రామాయణం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిన గొప్ప ఇతిహాసమని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, జీవితంలో ఏదో ఒక సమయంలో ప్రతి ఒక్కరికీ జ్ఞానోదయం కలుగుతుందని తెలిపారు. ఆ మార్పును స్వీకరించి ధర్మబద్ధంగా మంచి మార్గంలో పయనించడమే మనిషి జీవితానికి నిజమైన అర్థమని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి అందించిన స్ఫూర్తితో ఎంతోమంది రచయితలుగా, కవులుగా ఎదిగారని తెలిపారు. పెద్దబాలశిక్ష వంటి పుస్తకాల ద్వారా అనేక అంశాలపై జ్ఞానాన్ని పొందవచ్చని చెప్పారు.



మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం, వారి ఆదర్శాలను ఆచరించడం నేటి తరానికి ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ఎస్‌డీసీ సుదర్శన్, జెడ్పీ సీఈవో రమేష్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సయ్యద్ రఫీ, ఏవో రాజ్‌కుమార్, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు అండగా అఖిల రాజ్ ఫౌండేషన్

- చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నోట్‌బుక్స్ పంపిణీ

చేర్యాల ప్రతినిధి, అక్టోబర్ 26, :

ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరమవుతున్న నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా అఖిల రాజ్ ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఎస్సై తౌడ సత్యనారాయణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త ఇనుప రవి, జిల్లా ఇన్‌చార్జి కీసరి స్వామి, దుబ్బాక మండల అధ్యక్షుడు పాకనటి సునీల్ కుమార్, సలహాదారుడు వడిచెర్ల



వెంకటేశం పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించి, వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని వివరించారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి దోహదపడేలా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రణీత, కళాశాల సిబ్బంది సుదర్శన్, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అఖిల రాజ్ ఫౌండేషన్ నినాదం.. "ప్రతి విద్యార్థికి విద్యా అవకాశం.. ప్రతి గ్రామంలో విజ్ఞాన వెలుగు"

బాలల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

బాలలపై లైంగిక వేధింపులను అరికట్టి, వారి హక్కులకు రక్షణ కల్పించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య సూచించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సుదర్శన్ ఆదేశాల మేరకు, దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం సిద్దిపేటలోని విద్యావర్ధిని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సౌజన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల హక్కులు, వ్యక్తిగత భద్రత, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం–2012లోని ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలు తమకు ఎదురయ్యే అసురక్షిత పరిస్థితులను గుర్తించాలని, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు విషయాన్ని తెలియజేయాలని సూచించారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు పిల్లలకు తగిన అవగాహన కల్పించడంతో పాటు, వారి భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పిల్లలు తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించే వాతావరణాన్ని కల్పించడం ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ న్యాయ సహాయ




రక్షణ న్యాయవాది రవికుమార్, విద్యావర్ధిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ కుమార్, సైబర్ నేరాల విభాగం పోలీసు అధికారి హరీష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాలకు జీవనోపాధి కల్పిస్తున్న వంశీధర్ రావు

- కేఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు, మహిళలకు అండ
- జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖ చిత్రకారుడు రుస్తుం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

నిరుద్యోగులకు, అట్టడుగు వర్గాలకు అండగా నిలుస్తూ జీవనోపాధి కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) యువ నాయకుడు కల్వకుంట్ల వంశీధర్ రావు సేవలు అభినందనీయమని ప్రముఖ చిత్రకారుడు



రుస్తుం అన్నారు. కల్వకుంట్ల వంశీధర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుంట్ల రంగారావు పేరుతో కేఆర్ఆర్ ఫౌండేషన్‌ను స్థాపించి, దాని ద్వారా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న వంశీధర్ రావు పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగులకు డ్రైవింగ్ లైసెన్సులు అందించడం, మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాల ద్వారా వారి స్వయం ఉపాధికి తోడ్పడుతున్నారని కొనియాడారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా వంశీధర్ రావుకు రంగులమయమైన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన మరిన్ని ప్రజాసేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు రుస్తుం, ఆర్ఏఎఫ్ అధ్యక్షురాలు జులేఖా రుస్తుం తదితరులు పాల్గొని వంశీధర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రైతులు యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

- ఎల్ నినో పై రైతులకు అవగాహన కల్పించాలి
- దుబ్బాక డివిజన్ ఏడీఏ కాంపాటి మల్లయ్య

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 26, :

ఎల్ నినో ప్రభావంతో రైతులు యాసంగి సీజన్ లో వరికి బదులు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, వేరుశనగ, పెసర, మినుములు, కూరగాయలు, తదితర పంటలు సాగు చేయాలని దుబ్బాక డివిజన్ ఏడీఏ కాంపాటి మల్లయ్య అన్నారు. సోమవారం ఏడీఏ కార్యాలయంలో దుబ్బాక మండల ఏఈఓలు, డిజిటల్ క్రాప్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏఈఓ రైతులకు ఎల్ నినో వల్ల కలిగే అనర్థాలను వివరించి వరి పంట బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రతి గ్రామంలో సమావేశం నిర్వహించాలన్నారు. అదే విధంగా డిజిటల్ క్రాప్ సర్వేను ఈ నెల 27వ తారీకు లోపల పూర్తి చేయాలని కోరారు. రోజు రోజుకీ భూగర్భ జలాలు తగు ముఖం పడుతున్నాయి. కావున రైతులు తక్కువ నీటిని వినియోగించే పంటలు పండించాలని కోరారు. ప్రతి ఏఇఓ రైతు వేదిక లో రైతులకు అందుబాటు లో ఉండి సలహాలు సూచనలు ఇవ్వాలని, లేని ఎడల శాఖ పరమైన చర్యలు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో ఏఈఓ లు



సంతోష్, హరీష్, మనోజ్ఞ అనూష, సమజాత సంధ్య, రేణుక, అరుంధతి, డిజిటల్ క్రాఫ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

- పోలీసు అమరవీరులకు నివాళిగా సిద్దిపేటలో భారీ సైకిల్ ర్యాలీ
- వందకు పైగా సైకిళ్లతో పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించి అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం సిద్దిపేట పట్టణంలో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభమైన ఈ ర్యాలీని పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ జెండా ఊపి ప్రారంభించారు. ఆమె స్వయంగా సైకిల్‌పై ర్యాలీలో పాల్గొని, చివరి వరకు కొనసాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వందకు పైగా సైకిళ్లతో సాగిన ఈ ర్యాలీలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు రాత్రింబవళ్లు నిర్విరామంగా నిర్వహించే విధులను ప్రజలకు తెలియజేయడంతో పాటు, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తిని భావితరాలకు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారికి తగిన గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ ముస్తాబాద్ చౌరస్తా, విక్టర్ చౌరస్తా మీదుగా సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తా వరకు కొనసాగింది. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ ప్రజల్లో పోలీసు అమరవీరుల త్యాగాలపై అవగాహన కల్పించింది. ర్యాలీని అనుసరిస్తూ పోలీసు అధికారులు, సిబ్బంది ద్విచక్ర వాహనాలపై పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలపడమే కాకుండా, పోలీసు వ్యవస్థకు ప్రజలకు మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట పట్టణ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గురునానక్ మందిర్ కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి భూమిపూజ

- గురునానక్ మందిర్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 26, :

గతంలో గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడలో రెండు కమాన్ల నిర్మాణానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రవేశ మార్గంలో ఒకటి, మందిర్‌కు సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరొక కమాన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అంతకు ముందు గురునానక్ మందిర్‌ను సందర్శించిన జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలో పరిష్కరిస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. మందిర్ ప్రాంగణంలో రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్‌కు జగ్గారెడ్డి సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిక్కు ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల



రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

- ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల దర్యాప్తును సకాలంలో పూర్తి చేయాలి
- సిద్దిపేట ఏసీపీ కార్యాలయ తనిఖీలో పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసులతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన దర్యాప్తును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఆమె సిద్దిపేట ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ రికార్డులు, కేసు దస్త్రాలను పరిశీలించి, పెండింగ్ కేసుల పురోగతి, వాటి ప్రస్తుత స్థితిగతులు, రికార్డుల నిర్వహణ, కార్యాలయ ప్రాంగణం పరిశుభ్రతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డికి పలు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని, నిర్దేశిత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యాలయంలోని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ క్రమపద్ధతిలో భద్రపరచాలని, కార్యాలయ నిర్వహణలో ఐదు సూత్రాల విధానమైన '5ఎస్'ను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.



ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం

పోలీసు కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో ఓపికగా మాట్లాడి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకోవాలని సీపీ సూచించారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డితో పాటు సిద్దిపేట టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ మురళి, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, సిద్దిపేట రూరల్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

- ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే జారె

దమ్మపేట, అక్టోబర్ 26, :

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో యాసంగి సీజన్‌లో రైతులు అనుసరించాల్సిన సాగు ప్రణాళికపై అవగాహన కల్పించేందుకు సోమవారం దమ్మపేట మండల కేంద్ర శివారులోని రైతు వేదికలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆత్మ డైరెక్టర్లు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల వారీగా అవగాహన కార్యక్రమాలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో నేపథ్యంలో వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగుపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు గ్రామపంచాయతీల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు, ఆత్మ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.



రైతు వేదికల అభివృద్ధికి ప్రతిపాదనలు

ఆత్మ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు మాట్లాడుతూ, రైతు వేదికల్లో అవసరమైన కనీస సౌకర్యాల కల్పనకు సంబంధించి రైతు వేదికల వారీగా అంచనాలు (ఎస్టిమేట్లు) తయారు చేసి అందించాలని సూచించారు. వాటి ఆధారంగా ఎమ్మెల్యే సహకారంతో అవసరమైన బడ్జెట్ మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.

ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

వ్యవసాయ శాఖ ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ, రైతుల రిజిస్ట్రేషన్లు, పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో యాసంగిలో పరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని ఏఈఓలను ఆదేశించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అనువైన పంటల సాగుపై సూచనలు అందించాలని తెలిపారు.ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ, విద్యుత్ శాఖ, పశుసంవర్ధక శాఖ, సాగునీటి శాఖ, వి.బి.జి. రామ్ జీ అధికారులు, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి, వాసం శ్రీను, అశ్వారావుపేట డివిజన్ ఏఈఓలు, మండల వ్యవసాయ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, వినయ్, అరుణ్‌బాబు, అనూషతో పాటు ఆత్మ డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలి

రాష్ట్ర రావాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

ఇప్పటికే అడుగంటిన భూగర్భ జలాలవల్ల ఈత, తాటిచెట్ల నుండి కల్లు అంతంతామాత్రన రావడంతో, సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండల పరిధిలోని జప్తి నాచారం గ్రామానికి చెందిన గౌడ కులస్థులకు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, గౌడ కులస్థులు చెట్లను రక్షించుకొనే దిశలో ఉండేందుకు సోమవారం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఐఎన్టియూసి అధ్యక్షులు వడ్లకొండ రవీందర్ గౌడ్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకుపోయారు. ఆయన వెంటనే స్పందించి సిద్దిపేట జిల్లా విద్యుత్ శాఖ సూపరిండెంట్ అధికారితో మాట్లాడి ఈత వనంకు సరిపడు విద్యుత్ స్థంబాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా అందించి గౌడ కులస్థులను ఆదుకోవాలని ఆదేశించారు. మంత్రి తక్షణమే స్పందించి ఆదేశించినందుకు జప్తినాచారం గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. అదేవిదంగా సహకరించిన విద్యుత్ అధికారులకు ధన్యవాదములు తెలియజేశారు.

మిరుదొడ్డి మండల అధ్యక్షుడిని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 26, :

కొంపల్లిలోని మెడ్ వన్ ఆసుపత్రిలో వైరల్ ఫీవర్‌తో చికిత్స పొందుతున్న మిరుదొడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్ర రాజిరెడ్డిని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మెదక్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ సోలిపేట ప్రసాద్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి పద్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ధర్మాజీపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు షూ, బెల్టుల పంపిణీ

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 26, :



దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డులోనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేస్తున్న షూ, బెల్టులను కౌన్సిలర్ వనం రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడం, పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించడం వంటి అంశాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట వరం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 26, :



జగిత్యాల పట్టణం 14వ వార్డుకు చెందిన గజ్జెల అపర్ణకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.1,87,000 విలువైన చెక్కును సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అపర్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. అవసరమైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, కౌన్సిలర్ బొల్లారపు స్వప్న గిరిధర్, ఆకుల తిరుపతి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

రోడామేస్త్రి నగర్ డివిజన్‌లో కాంగ్రెస్‌లోకి పలువురు నాయకులు, కార్యకర్తలు చేరిక

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 26, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని రోడామేస్త్రి నగర్ డివిజన్ రోడ్ మేస్త్రీ నగర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీలో పలువురు నాయకులు, కార్యకర్తలు చేరారు. నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ అజమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో వారు పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఫైమిదే బేగం, కౌటీ, అఫ్రీన్ బేగం, యస్సామీన్ బేగం, ఫాతిమా బేగం, రుబీనా బేగం, రుఖ్యా బేగం, సాజీదే బేగం, కాయుణ్ణిసా, ఫోజియా బేగం, షేక్ షానవాజ్, షేక్ యూసఫ్, సైడ్ మాసురన్, షేక్ ఫిరోజ్, మహమ్మద్ అజమ్, మహమ్మద్ తౌఫిక్, మహమ్మద్ సాబేర్, మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ జునైద్, మహమ్మద్ మజహర్, సైడ్ బహుద్దీన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గణేష్, డివిజన్ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మహిళా కోఆర్డినేటర్ కార్యదర్శి ఫారీన్ ఖాన్, డీసీసీ మైనారిటీ జనరల్ సెక్రటరీ షఫీ, అజార్, షరీఫ్, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు 'సత్వర న్యాయం' జరిగేలా చర్యలు



జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, : ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

జాబితాపూర్ గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 26, : జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామ పంచాయతీ భవనాలు ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. రాజకీయాలు ఎన్నికల వరకు పరిమితమని, అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు తో పేద ప్రజల సొంతింటి కల సాకారం అవుతుంది అన్నారు. ఎల్ నీ నో సూపర్ ఎల్ నీ నోగా మారబోతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి కరెంట్ నీరు పొదుపుగా వాడాలని అన్నారు. రైతులు ఆరుతడి పంటలు సాగు వైపు ఆలోచన చేయాలని సూచించారు. రైతుల పంట ఉత్పత్తుల అమ్మకం ప్రక్రియలో ,కరెంట్ విషయం లో సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఆర్ఓ హకీం, ఎంపీఓ రవి బాబు, ఏఈ విజయ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు పరిష్కరించాలి

- పంట కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి
- తహసీల్దార్‌కు భారతీయ కిసాన్ సంఘ్ నాయకుల వినతిపత్రం

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 26, : రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘ్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం దుబ్బాక పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు డాకూరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో రైతు నాయకులు తహసీల్దార్‌ను కలిసి, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలపై తక్షణమే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల కొనుగోలు క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించాలని, పంట కోతలు ప్రారంభమయ్యే నాటికే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో విధించే పరిమితులను తొలగించి, రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు రహదారికి ఆనుకుని కనీసం పది ఎకరాల స్థలాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు.

రైతుల సమస్యలను విస్మరిస్తే ఉద్యమం

రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను, రైతాంగ అవసరాలను విస్మరించిందని వారు విమర్శించారు. రైతులు పండించిన పంటలను విక్రయించుకునే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరంగల్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను అమలు చేయడంతోపాటు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రైతాంగంతో కలిసి భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేసి, రైతుల హక్కులను సాధించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షుడు కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు డాకూరి రాజిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మంద అనిల్ రెడ్డి, రొండ్ల కరుణాకర్ రెడ్డి, పంగ ఎల్లారెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేయాలి: ఎమ్మెల్యే జారె

- దమ్మపేట మండలంలో ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

దమ్మపేట, అక్టోబర్ 26, : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిజిటల్ విధానంలో చేపడుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని దమ్మపేట మండలంలో పరిశీలించారు. ఈ సందర్భంగా బాలరాజుగూడెం, జగ్గారం, అంకంపాలెం, పట్వారిగూడెం, పార్కలగండి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించి ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు



అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామాల వారీగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ శ్రేణుల సమిష్టి కృషితోనే ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్, సీనియర్ నాయకులు వాసం శ్రీనివాసరావు, సర్పంచులు కుర్సం శ్రీనివాసరావు, వంకా జానకి రాముడు, మోకాళ్ళ గురుమూర్తి, మడకం గంగరాజు, కూరం అర్జున్ రావు, కాంగ్రెస్ నాయకులు బొల్లికొండ నాగేశ్వరరావు, కోర్సా సాగర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా మన్నె రాజు

- బోయ సోదరుల కోసం సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తా: మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 26, : సాయిబాబా నగర్ డివిజన్‌లోని రామ్‌లీలా మైదానంలో బోయ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన జీవితం, గొప్పతనం, సమాజానికి అందించిన సందేశాలను వివరించారు. ఈ సందర్భంగా మన్నె రాజు మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన రచించిన రామాయణం సమాజానికి నైతిక విలువలు, ధర్మబద్ధమైన జీవనం, మానవతా సందేశాలను అందించిందని పేర్కొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తా

వాల్మీకి జయంతి వేడుకల సందర్భంగా బోయ సోదరులు తమ సామాజిక కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణకు ప్రత్యేక సామాజిక భవనం అవసరమని మన్నె రాజు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన, బోయ సోదరుల కోసం స్థలం కేటాయింపునకు కృషి చేయడంతో పాటు సామాజిక భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో తక్షణమే మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బోయ సోదరుల అభ్యర్థన మేరకు సామాజిక భవన నిర్మాణానికి చొరవ చూపుతానని హామీ ఇవ్వడంతో కార్యక్రమంలో పాల్గొన్న వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ



కార్యక్రమంలో బోయ సోదరులు లక్ష్మణ్, రామకృష్ణ, అజయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, సత్తి రెడ్డి, గురువారెడ్డి, గణేష్, సాయి రెడ్డితో పాటు ఇతర నాయకులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

మహనీయుడు శ్రీ వాల్మీకి మహర్షి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రసూనాంబ
- కలెక్టరేట్లో ఘనంగా శ్రీ వాల్మీకి జయంతి వేడుకలు

జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, : ప్రపంచానికి ధర్మం, న్యాయం, సత్యం, సేవా మార్గాలను చాటిన శ్రీ రామాయణ మహాకావ్య రచయిత, ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ ఆ మహనీయుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ మాట్లాడుతూ ఇతిహాస రామాయణ మహాకావ్యాన్ని గ్రంథం రూపంలో మానవాళికి అందించిన మహనీయుడు మహర్షి. అన్నదమ్ముల బంధాన్ని, ఇచ్చిన మాటకు కట్టుబడే విధానం, గురు భక్తి లాంటి ఆచరణీయమైన పద్ధతులను రామాయణం ద్వారా రచించారని గుర్తు చేశారు. శ్రీ వాల్మీకి రచించిన రామాయణం, చెడు మీద మంచి విజయం సాధిస్తుందన్న సందేశాన్ని అందిస్తుందని అన్నారు. ఇది కేవలం ఒక కథ మాత్రమే కాదు, ధర్మం, నీతి, స్నేహం, కుటుంబ విలువలను మనకు నేర్పే ఒక అద్భుత పాఠంలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధు సుధన్, బిసి వెల్ఫేర్ అధికారి జయ రాజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 26, : ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీఓలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఆదేశం
- ప్రజావాణిలో 103 దరఖాస్తుల స్వీకరణ
- వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ఆదేశించారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై వినతులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 103 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన



సమాధానం ఇవ్వాలి

ప్రజావాణికి ముందు జిల్లా అధికారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని ఎప్పటిలోగా పరిష్కరిస్తారనే విషయంపై అధికారులను ఆరా తీశారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతోపాటు అర్జీదారులకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణితోపాటు నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజావాణి కార్యక్రమాల్లో అందిన దరఖాస్తులను సైతం నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోసం నమ్మకంతో వచ్చే ప్రజలకు అధికారులు బాధ్యతాయుతంగా సేవలందించాలని స్పష్టం చేశారు.


వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు

వచ్చే వేసవిలో ప్రజలకు ఇంటింటికీ తాగునీరు అందించేందుకు నవంబర్ మొదటి, రెండో వారాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికల్లో భాగంగా మిషన్ భగీరథకు సంబంధించిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం, పైపులైన్లలో ఎక్కడా లీకేజీలు లేకుండా చూడటం, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు వృథా కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ఎస్‌డీసీలు సుదర్శన్ రెడ్డి, విజయలక్ష్మి , శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ప్రాణప్రతిష్ఠలో పాల్గొన్న బండి రమేష్

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 26,:

మోతీనగర్ డివిజన్ పరిధిలోని పాండురంగ నగర్ కాలనీలో సోమవారం అయ్యప్ప స్వామి వారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోతీనగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్ ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరై స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవంలో స్థానిక నాయకులు చిన్న రమేష్, గంట శ్రీనివాస్ గౌడ్, శివాజీ, మనోజ్ దుబే తదితరులు పాల్గొన్నారు



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

- ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

రంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 26, :

ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 76 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి దరఖాస్తుపై అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, పశువుల సంరక్షణ, వైద్య శిబిరాల నిర్వహణ, వ్యవసాయ ప్రణాళిక, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా తాగునీటి సమస్యలను గుర్తించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులకు తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు.



రబీ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

రానున్న రబీ సీజన్‌లో వేరుశెనగ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కరపత్రాలు, పోస్టర్లు, ఆడియో, వీడియో మాధ్యమాల ద్వారా వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు సూచనలు అందించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు, ఓవర్‌లోడ్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాలు, మున్సిపాలిటీల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

76 ఫిర్యాదుల స్వీకరణ

ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 39, ఇతర శాఖలకు సంబంధించి 37 దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 76 ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్ర రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల జీవనోపాధికి భరోసా



- అధికారులతో బండి రమేష్ చర్చలు

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 26, :

ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద గత 30 ఏళ్లుగా బడ్డీ కొట్లు, పాన్ డబ్బాలు, ఇతర చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న నిరుపేదలకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు,తెలంగాణ ప్రభుత్వ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అండగా నిలిచారు.దుకాణాలు ఖాళీ చేయాలన్న అధికారుల ఆదేశాల నేపథ్యంలో సోమవారం ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు క్రాంతి ముదిరాజ్‌తో కలిసి చిరు వ్యాపారులను పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం సంబంధిత మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, నిరుపేద కుటుంబాల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించాలని కోరారు.దీనిపై స్పందించిన అధికారులు చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సూరజ్ తివారి, క్రాంతి, కిట్టు, రాము, నర్సింగ్, ఇజాజ్, రమణ, వినయ్, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

- రామాయణం భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 26,:

ఆల్విన్ కాలనీ ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ,అంబేద్కర్ నగర్‌లో సీనియర్ నాయకులు బోయ కిషన్ ఆధ్వర్యంలో సోమవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై, వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్



మాట్లాడుతూ,సత్యం, ధర్మం, న్యాయం, మానవీయ విలువల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఆయన రచించిన రామాయణ మహాకావ్యం భారతీయ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన అమూల్యమైన సాహిత్య సంపద అని పేర్కొన్నారు.రామాయణంలోని ఆదర్శాలు, నైతిక విలువలు తరతరాలకు స్ఫూర్తినిస్తూ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు.వాల్మీకి మహర్షి జీవితం ఆధ్యాత్మిక పరివర్తనకు, జ్ఞానోదయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మం, మానవత్వం వంటి విలువలను ఆచరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, మారెళ్ళ శ్రీనివాస్, మల్లేష్, మహేష్, వాలి నాగేశ్వరరావు, రవీందర్, నాగరాజు, జనార్దన్, పూలరంగడు, రాజేష్, మొదులేటి, పత్తిరత్త కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 26,:

మూసాపేట్‌కు చెందిన బాలాగౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పనుల పరిస్థితిని పరిశీలించిన అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రశాంత్ నగర్‌లో బీజేపీకి యువజన జోష్

- కాషాయ కండువా కప్పుకున్న యువత
- మోదీ నాయకత్వం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరిక

కూకట్‌పల్లి ప్రతినిధి,అక్టోబరు 26, :

ఏ వీ బీ పురానికి చెందిన పలువురు యువకులు సోమవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. యువ నాయకులు కార్తీక్, లక్ష్మణరావు నాయకత్వంలో, జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, దేశాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల పట్ల ఆకర్షితులై యువకులు బీజేపీలో చేరినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యువత పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై బీజేపీలో చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. దేశాభివృద్ధి, ప్రజాసేవలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పార్టీలో నూతనంగా చేరిన యువకులకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ డివిజన్



అధ్యక్షుడు వీరన్ కుమార్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి ప్రతినిధి,అక్టోబరు 26, :

మూసాపేట్ డివిజన్ పి ఆర్ నగర్‌లోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్‌తో పాటు అంబటి శ్రీను, తిరుపతి, ఉదయ్, రాజ్ కుమార్, సుధాకర్ రెడ్డి, జోసెఫ్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ (ప్రభుత్వ) పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన కలెక్టర్ సత్య ప్రసాద్



జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

జగిత్యాల పట్టణంలోని తహసీల్దార్ ఆఫీస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన జగిత్యాల కలెక్టరేట్ ప్రభుత్వ పెట్రోల్ బంక్ ను జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్య ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఐడిఓసి ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారంతో ఈ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని తహసీల్దార్ ఆఫీస్ చౌరస్తాకు వచ్చే ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, వాహనదారులకు ఇంధనాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌లో నాణ్యత ప్రమాణాలు, సరైన కొలతలు, భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని, పెట్రోల్ బంక్ నిర్వహణలో పారదర్శకత పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించడంతో పాటు, వాహనదారులకు సౌకర్యవంతంగా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై. ప్రసాద్ (డీఆర్ఓ), ఆర్డీఓ మధుసూదన్, కలెక్టరేట్ ఏఓ కిషన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, పెట్రోల్ బంక్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ సభ్యత్వ కార్డు స్వీకరించిన బొబ్బ నవత రెడ్డి



కూకట్‌పల్లి ప్రతినిధి, అక్టోబర్ 26, :

కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యత్వ కార్డును అడ్వకేట్, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి సోమవారం స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ సురేందర్ గౌడ్ చేతుల మీదుగా ఆమె సభ్యత్వ కార్డును అందుకున్నారు.ఈ కార్యక్రమంలో చిందం శ్రీకాంత్ యాదవ్, శివ, వంశీ, వరలక్షి , శరత్ తదితర న్యాయవాదులు

మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఘన నివాళి



సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 26, :

ఆశ్వయుజ మాస పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఆదికవి మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని సోమవారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రామాయణ మహాకావ్యాన్ని రచించి ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవీయ విలువలను చాటిచెప్పారని పేర్కొన్నారు. ఆయన రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తూ సమాజానికి ధర్మమార్గాన్ని బోధిస్తోందని తెలిపారు. మహర్షి వాల్మీకి బోధనలు మానవత్వం, నైతిక విలువలు, కర్తవ్యపాలన వంటి గొప్ప లక్షణాలను పెంపొందించు కోవడానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ నీతి మార్గంలో నడవడమే మహర్షి వాల్మీకికి మనం అందించే నిజమైన నివాళి అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్లు నాగేశ్వర్ రావు, నగేష్, ఆర్ఐలు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

వాల్మీకి మహర్షి ఆశయాలు స్ఫూర్తిదాయకం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా కార్యాలయంలో సోమవారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పార్టీ శ్రేణులతో కలిసి వాల్మీకి ఫోటోకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సమాజానికి ధర్మం, సత్యం, నీతి, మానవత్వం వంటి గొప్ప విలువలను చాటి చెప్పారని కొనియాడారు. ఆయన జీవితం, ఆశయాలు నేటి తరాలకి స్ఫూర్తిదాయకం అన్నారు. వాల్మీకి చూపిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి దేశ సేవకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల నాగరాజు, ప్రశాంత్, ప్రణయ్, భరత్, సాయి, రాకేష్, వివేక్ ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

- పెండింగ్ విచారణలు 15 రోజుల్లో పూర్తి చేస్తాం
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి
- బాధిత కుటుంబాలతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, :

రైతు ఆత్మహత్యలతో కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు కొండల్ రెడ్డి, లక్షి , హరిణి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలతో కలిసి జిల్లా కలెక్టర్ కట్టా హైమావతికి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న బాధిత కుటుంబాల పునర్విచారణలను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు సంబంధించిన పునర్విచారణల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలు పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ విచారణలు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు.

కుటుంబ పెద్దను కోల్పోయి.. ఆర్థిక కష్టాలతో సతమతం..

రైతు ఆత్మహత్యతో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలు ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వారు తెలిపారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ వంటి కనీస అవసరాలను తీర్చుకోవడం కూడా కష్టంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పరిహారం కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి రావడం బాధితకుటుంబాలకు మరింత భారంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి పెండింగ్ విచారణలను వెంటనే పూర్తి చేయడంతో పాటు, అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



15 రోజుల్లో విచారణలు పూర్తి చేస్తాం

బాధిత కుటుంబాల సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి పెండింగ్‌లో ఉన్న విచారణలను 15 రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు విచారణలు సకాలంలో పూర్తిచేసి, అర్హులైన కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రిత సంస్థ సభ్యులు గణేష్, రమేష్, వీణా, మౌనిక, కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ సభ్యులు సుజాత, శ్వేత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారమే దీనబంధు దర్బార్ లక్ష్యం

- గాంధీభవన్‌లో వినతులు స్వీకరించిన డాక్టర్ కవ్వంపల్లి

హైదరాబాద్ బ్యూరో, అక్టోబర్ 26, :

దళితుల సమస్యల పరిష్కారమే దీనబంధు దర్బార్ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దీనబంధు దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. దళితులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, ముఖ్యంగా భూ సమస్యలు చాలావరకు పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. దళితులకు చెందిన వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని, లిడ్‌క్యాప్ భూముల ఉదంతమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. దీనబంధు దర్బార్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ దళితుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. దళిత జాతికి సేవ చేసే అవకాశాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనకు కల్పించారని, ఈ అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చేందుకు దీనబంధు దర్బార్‌ను వేదికగా ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్లోని అంశాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.



ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం.. 'ఓట్ బచావో – దేశ్ బచావో' ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జిల్లా కాంగ్రెస్ నేతలకు ఏఐసీసీ అబ్జర్వర్ మోహన్ కుమార మంగళం పిలుపు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 26, : ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో – దేశ్ బచావో' ప్రచార కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఆదేశాల మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తమిళనాడు రాష్ట్రం నుంచి విచ్చేసిన ఏఐసీసీ అబ్జర్వర్ మోహన్ కుమార మంగళం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సభూపతి రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంతో పాటు ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ప్రచారం కీలకమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 'ఓట్ బచావో – దేశ్ బచావో' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ శ్రేణులు చురుకుగా భాగస్వాములు కావాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



"ఓట్ బచావో దేస్ బచావో" కార్యక్రమం విజయవంతం చేయాలి

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 26, :

ఢిల్లీలో నవంబర్ 1 న జరుగబోవు కార్యక్రమం సన్నాహక సమావేశం కార్యక్రమానికి విచ్చేసిన ఏఐసీసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి శరత్ జీ, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ లతో కలిసి జగిత్యాల డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతం చేయడానికి ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ నుండి పెద్ద సంఖ్యలో ఢిల్లీ వెళ్తామని రామ్ లీలా మైదానంలో కార్యక్రమం ఉంటుందని, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే, ప్రియాంక గాంధీ లు కార్యక్రమం లో పాల్గొంటారని కార్యక్రమం విజయవంతం చేయాలనీ జగిత్యాల జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు ఢిల్లీ రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి. శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ నారాయణ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జెల్ల రవి, ప్రధాన కార్యదర్శి కూసరి. అనిల్, పులి రాజానర్సింహ, పీసీసీ సేవాదళ్ సెక్రటరీ ముకేష్ ఖన్నా, ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమాల రాజ్ కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు భూమా రెడ్డి, ద్యావనపల్లి. రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఘన సన్మానం

- సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రోత్సాహకం!
- అశ్వారావుపేట ప్రతిభకు గుర్తింపు: మన్యం ప్రభుకుమార్, కొనకళ్ళ ఇందు, ఏరువాక వర్షిణిలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి అభినందనలు.
- డిజిటల్ రంగానికి సత్తుపల్లి ఎమ్మెల్యే ఆసరా: ఆకట్టుకున్న అశ్వారావుపేట సోషల్ మీడియా ప్రతిభావంతులు.

అశ్వారావుపేట అధికార ప్రతినిధి,అక్టోబర్ 26, :

అశ్వారావుపేట మండలానికి చెందిన ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ను సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సమాజంలో డిజిటల్ మీడియా పాత్ర రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో తమ సృజనాత్మకత తో సోషల్ మీడియా ద్వారా ప్రజలను అలరిస్తూ గుర్తింపు తెచ్చుకున్న అశ్వారావుపేట మండలానికి చెందిన మన్యం ప్రభు కుమార్, కొనకళ్ళ ఇందులతో పాటు ఆసుపాక గ్రామానికి చెందిన ఏరువాక వర్షిణిలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా శాలువా, జ్ఞాపికలతో వారిని ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ నేటి యువత సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ తమలోని నైపుణ్యాలను చాటుకోవడం అభినందనీయం. సోషల్ మీడియాను సమాజానికి మంచి సందేశాలు ఇచ్చేందుకు, ప్రాంతీయ ప్రతిభను చాటేందుకు వేదికగా మార్చుకోవాలి అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం పొందడం పట్ల ఇన్‌ఫ్లుయెన్సర్లు హర్షం వ్యక్తం చేస్తూ, తమకు ఈ గౌరవం అందించినందుకు డాక్టర్ మట్టా రాగమయి కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు మరియు అభిమానులు పాల్గొన్నారు.





జానపద కవిరాజు కొసరాజు

నేడు కొసరాజు రాఘవయ్య వర్ధంతి

తెలుగు చిత్రసీమలో జానపదం అనగానే ముందుగా గుర్తుకు వచ్చే నటులు నందమూరి తారక రామారావు, దర్శకుడు బి.విఠలాచార్య కాగా, జానపద గీతం అనగానే వెనువెంటనే స్ఫురించే పేరు కొసరాజు రాఘవయ్య చౌదరిదే. కొసరాజు రాఘవయ్య చౌదరి, తెలుగు జానపద సాహిత్యానికి ఎనలేని కీర్తిని తెచ్చిన ప్రముఖ కవి, గీత రచయిత, రచయిత. 'జానపద కవిరాజు'గా, 'కవిరత్న'గా ప్రశంసలందుకున్న ఆయన తెలుగు జానపద సాహిత్యంలో గాథల్ని సృష్టించారు. 1905లో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా కర్లపాలెం మండలం, చింతాయపాలెం గ్రామంలో లక్ష్మమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించిన రాఘవయ్య జీవితమంతా తెలుగు గ్రామీణ జీవనాన్ని తన రచనల్లో ప్రతిబింబించాడు. తెలుగు జానపద సాహిత్యాన్ని సమున్నతంగా నిలిపిన కొసరాజు రాఘవయ్య, కేవలం పాటల రచయితగానే కాక, పల్లె జీవితం, సంప్రదాయాలు, పండుగలు, వ్యవసాయం వంటి అంశాలను తన గీతాల్లో చక్కగా మేళవించాడు. ఆయన రచనల్లో గ్రామీణ ప్రజల శైలీ, జీవన విధానాలు, పండుగ సంబరాలు, పెళ్లిళ్లు, పల్లె జీవనంలోని ప్రత్యేకతలు స్పష్టంగా ప్రతిఫలిస్తాయి. పాఠకుడు పల్లె జీవితం, పల్లె సౌందర్యాన్ని ఆస్వాదించగలిగేలా తన రచనల ద్వారా ఆయన తెలుగుదనాన్ని పంచాడు. ప్రకృతి, పొలాలు, పక్షులు, చెట్లు, జంతువులు, నదులు వంటి ప్రకృతి అంశాలను ఆయన తన రచనల్లో అద్భుతంగా మిళితం చేసి, పాఠకులను ప్రేరేపించాడు. కొసరాజు రాఘవయ్య తన రచనల్లో కుల వివక్ష, అణగారిన వర్గాల సమస్యలు, అవినీతి వంటి సామాజిక సమస్యలను సునిశితంగా ప్రస్తావించారు. పల్లె ప్రజల దుఃఖాలు, అణచివేతలను వ్యక్తం చేస్తూ సమాజంలో మార్పు రావాలనే కృతనిశ్చయంతో తన రచనల్లో సామాజిక సందేశాలను చేర్చారు. మానవ జీవనంలోని ప్రేమ, విరహం, మమత వంటి భావజాలాలను సున్నితంగా, హృద్యంగా, అత్యంత చక్కగా ప్రతిబింబించారు. ఈ పాటలు గాఢమైన భావనలతో పాఠకులను హత్తుకునేలా ఉంటాయి. సాధారణ ప్రజల జీవనంలోని హాస్యాన్ని కూడా ఆయన రచనలు అద్భుతంగా ప్రతిబింబిస్తాయి, పాఠకుడిని అలరిస్తాయి. రాఘవయ్య తొలిసారిగా కథానాయకునిగా 1939లో "రైతుబిడ్డ" చిత్రంలో నటించారు. తరువాత ఆయన కవిత్వ ప్రతిభను గుర్తించిన బి.ఎ. సుబ్బారావు, కె.వి. రెడ్డి వంటి దర్శకులు ఆయన్ని తమ చిత్రాలకు పాటలు వ్రాయించేందుకు ఆహ్వానించారు. 1954లో విడుదలైన "పెద్ద మనుషులు" చిత్రంలో ఆయన రాసిన పాటలు తెలుగు ప్రేక్షకుల మనసులను చూరగొన్నాయి. "రాజు పేద" చిత్రంలో ఆయన రాసిన "జేబులో బొమ్మ జేజేల బొమ్మ" పాట భలే ప్రాచుర్యం పొందింది. అలాగే "రోజులు మారాయి" చిత్రంలోని "ఏరువాక సాగారో," "ఇల్లరికములో ఉన్న మజా," వంటి పాటలు ఆయన ప్రతిభకు నిలువుటద్దంగా నిలిచాయ "జేబులో బొమ్మ జేజేల బొమ్మ", "ఏరువాక సాగారో", "ఇల్లరికములో ఉన్న మజా", "అయయో జేబులో డబ్బులు పోయెనే", "ముద్దబంతి పూలు బెట్టి", "మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా" మొదలైన గీతాలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలు. కొసరాజు రాసిన పాటలు పల్లె ప్రజల జీవితానికి ప్రతిధ్వనులుగా నిలిచాయి. ఈ గీతాలు మామూలు ప్రజల భావాలను అక్షరాలుగా మార్చాయి. కొసరాజు రాసిన కొన్ని గీతాలు శాశ్వతంగా ప్రజల మనస్సులలో నిలిచిపోయాయి, అవి ప్రతి పల్లె వాసి హృదయాన్నే కాదు, వారి జీవితాలనూ ప్రతిబింబించాయి. "కళ్ళు తెరచికనరా," "జయమ్ము నిశ్చయమ్మురా," "వినరా వినరా నరుడా" వంటి గీతాలు గ్రామీణ ప్రజల మనోభావాలను, వారి ఆశలను ప్రతిబింబించాయి. కొసరాజు రాఘవయ్య 1984లో రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. "కవిరత్న," "జానపద కవిసార్వభౌమ" వంటి బిరుదులతో గౌరవింపబడ్డారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ నిర్వహించిన బుర్రకథల పోటీలో ఆయన రాసిన "నవభారతం" బుర్రకథ ప్రథమ బహుమతిని అందుకుంది. చివరి బుర్రకథగా నిలిచిన "వినరా, ఆంధ్రకు మారా" అనే కృతి 1986 అక్టోబర్ 27న రాశారు; అదే రోజున ఆయన పరమ పదించారు. కొసరాజు రాఘవయ్య రచనలు తెలుగు సాహిత్యానికి ఒక అమూల్యమైన నిధిగా నిలిచాయి. ఆయన పాటలు, కవితలు తెలుగు ప్రజల మనసులను హత్తుకునేలా ఉంటాయి. పల్లె జీవితం, ప్రకృతి, గ్రామీణ సంస్కృతి, తెలుగు భాషలోని విలువలను ప్రతిబింబిస్తూ పాఠకులను స్ఫూర్తి ప్రదాయకంగా ప్రేరేపించాయి. రాఘవయ్య రాసిన పాటలు, బుర్రకథలు, కవిత్వం తెలుగు జానపద సాహిత్యానికి నిలువుటద్దంగా, నిత్య కీర్తిగా నిలిచిపోయాయి.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

నేడు కొమురం భీం వర్ధంతి

ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం. గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం. కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు,తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉ





న్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

భారత పదాతి దళం - దేశానికి కవచం

నేడు భారత పదాతిదళ దినోత్సవం...

కశ్మీర్ నుంచి పాక్ కబాలీలను తరిమి తరిమి కొట్టిన రోజు

భారత పదాతి దళం భారత సైన్యంలో అతిపెద్ద భాగం. దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. పదాతి దళ దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 27న జరుపుకుంటారు. 1947లో కశ్మీర్‌ను పాకిస్తాన్ ఆక్రమించకుండా కాపాడిన రోజును గుర్తు చేసుకుంటారు. 1947లో పాకిస్తాన్ కశ్మీర్‌ను ఆక్రమించడానికి ప్రయత్నించింది. భారత సైన్యం దాడిని విఫలం చేసింది. భారత సైన్యం లో అతిపెద్ద పోరాట విభాగమైన పదాతిదళం దేశానికి అందించిన సేవలు గుర్తించడానికి ప్రతి సంవత్సరం అక్టోబరు 27న పదాతి దళ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోంది. భారత సైన్యంలో అతిపెద్ద దళం పదాతి దళం. భూమిపై యుద్ధాలు చేయడం వీరి ప్రధాన బాధ్యత. వీరు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తారు. పదాతిదళ దినోత్సవం ముఖ్య ఉద్దేశం దేశానికి సేవ చేస్తూ తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరులను గౌరవించి, హృదయపూర్వక నివాళి అర్పించడం. అంతేకాదు, భారత సైనికులు చేసిన త్యాగాలు, సేవల గురించి దేశ ప్రజలకు అవగాహన కల్పించడం. భారత్ పాక్ ల మధ్య జరిగిన నాలుగు యుద్ధాలలో ఇది మొదటిది కశ్మీర్ యుద్ధం. స్వాతంత్ర్యం పొందిన రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధ పరిణామాలు నేటికీ ఇరు దేశాల భౌగోళిక, రాజకీయాలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. కశ్మీర్ విలీనం విషయంలో అప్పటి రాజు హరిసింగ్ తీసుకున్న నిర్ణయం పాక్‌కు షాకిచ్చింది. దీంతో కశ్మీర్‌ను ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తున్న పాక్‌కు.. భారత్ సైన్యం తగిన గుణపాఠం చెప్పిన తరిమి కొట్టింది. భారత సైన్యంలో అతిపెద్ద పోరాట విభాగమైన పదాతిదళం దేశానికి అందజేస్తోన్న సేవలకు గుర్తుగా ఏటా అక్టోబరు 27న పదాతి దళ దినోత్సవాన్ని నిర్వహించుకుంటాం. అక్టోబర్ 27 భారత సైన్యానికి చాలా ముఖ్యమైన రోజు. 1947లో ఇదే రోజున భారత సైనికులు.. పాకిస్థాన్ మద్దతుతో జమ్మూ కశ్మీర్‌ను ఆక్రమించేందుకు వచ్చిన మూకలను పొలిమేరల నుంచి తిప్పికొట్టి తోకముడిచేలా చేశారు. దేశ విభజన తర్వాత



కశ్మీర్ సంస్థానం ఎటు వెళ్ళాలో తేల్చుకోలేని పరిస్థితిలో మిగిలింది. కశ్మీర్ తన స్వతంత్ర ప్రతిపత్తిని నిలబెట్టుకోవాలని బలంగా కోరుకున్నప్పటికీ.. నాటి రాజకీయ పరిణామాలు ఎటో ఒకవైపు విలీనం కావాల్సిన పరిస్థితిని కల్పించాయి.

1947 ఆగస్టులో విభజన కారణంగా సాగిన హింస నుంచి కశ్మీర్ కూడా తప్పించుకోలేక పోయింది. పాకిస్థాన్ గిరిజనులు కశ్మీర్‌లోని మొహురా విద్యుత్ కేంద్రంపై దాడి చేయగా, హరిసింగ్ భారత ప్రభుత్వం సాయం కోరారు. వెంటనే స్పందించిన భారత ప్రభుత్వం రాజుకు అండగా సైన్యాన్ని పంపింది. పాకిస్తాన్ గిరిజనులుగా చెప్పుకునే కబాలీలను భారత సైన్యం తరిమికొట్టింది. ఆ తర్వాత కశ్మీర్‌ను భారత్‌లో కలుపుతున్నట్లు ఒప్పందంపై అక్టోబరు 26న మహారాజు హరిసింగ్ సంతకం చేశారు.భారత ప్రధాని నెహ్రూ ఆదేశాలతో సిక్ రెజిమెంట్ మొదటి బెటాలియన్.. అక్టోబరు 27న శ్రీనగర్ చేరుకుని పాక్ చొరబాటు దారులను తరిమి తరిమి కొట్టింది. పాక్ రేంజర్ల నుంచి కశ్మీర్‌ను కాపాడిన భారత సైన్యం.. ఈ క్రమంలో అనేక మంది సైనికులను కోల్పోయింది. పాకిస్తాన్ ఆక్రమణ దారులను అరికట్టడంలో లెఫ్టినెంట్ కల్నల్ దివాన్ రంజిత్ రాయ్ ముఖ్యమైన పాత్ర పోషించారు. కానీ దురదృష్టవశాత్తు బారాముల్లా ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయాడు. ఆయన ధైర్యసాహసాలు, దేశం పట్ల ప్రేమకు గుర్తుగా మరణానంతం మహావీర చక్ర అవార్డు పరించింది.

పదాతి దళం యొక్క ముఖ్య విధులు:

దేశ సరిహద్దుల రక్షణ: చైనా, పాకిస్తాన్ వంటి దేశాలతో ఉన్న సరిహద్దులను కాపాడటం, ఆపరేషన్లు: ఉగ్రవాద నిరోధక ఆపరేషన్లు, శాంతి స్థాపన ఆపరేషన్లు మొదలైనవి. దేశాంతర సహాయక చర్యలు: ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సహాయక చర్యలు చేపట్టడం. ప్రత్యేక దళాలు: పారా కమాండోలు, మౌంటెన్ ట్రూపర్స్ వంటి ప్రత్యేక దళాలు కూడా పదాతి దళంలోనే ఉంటాయి.

పదాతి దళం యొక్క ప్రత్యేకతలు:

విస్తృత శిక్షణ: పదాతి సైనికులు అన్ని రకాల పరిస్థితులలో యుద్ధం చేయడానికి శిక్షణ పొందుతారు. ఆధునిక ఆయుధాలు: వీరికి తుపాకులు, గ్రెనేడ్ లాంచర్లు, రాకెట్ లాంచర్లు వంటి ఆధునిక ఆయుధాలు అందుబాటులో ఉంటాయి. ధైర్యం మరియు నిబద్ధత: దేశం కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉండే ధైర్యం మరియు నిబద్ధత వీరి ప్రత్యేకత.

నిర్ధారణ:భారత పదాతి దళం దేశం యొక్క గర్వం. వీరు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్నారు. వారికి మనం ఎల్లప్పుడూ కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.





రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

మహిళా క్రికెట్‌కు మరింత జోష్!

- జనవరి 14 నుంచి డబ్ల్యూపీఎల్ 2027
- ఫిబ్రవరి 7 వరకు ఐదో ఎడిషన్.. అక్టోబర్ 28న ఆటగాళ్ల వేలం
- జట్ల కూర్పుపై ఫ్రాంచైజీల దృష్టి.. రెండేసి టైటిళ్లతో ముంబై, బెంగళూరు



న్యూఢిల్లీ: మహిళా క్రికెట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మరో సీజన్‌కు సిద్ధమవుతోంది. మహిళా క్రికెట్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు వేదికగా నిలుస్తున్న ఈ లీగ్ ఐదో ఎడిషన్ 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరగనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం టోర్నీ షెడ్యూల్‌ను ప్రకటించింది. అయితే మ్యాచ్‌లు నిర్వహించే నగరాల వివరాలను మాత్రం వెల్లడించలేదు. సాధారణంగా మార్చి ఆరంభంలో జరిగే డబ్ల్యూపీఎల్‌ను ఈసారి ముందుగానే నిర్వహించనుండటం విశేషం. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం నిర్వహణపై ఆసక్తి నెలకొంది. అక్టోబర్ 28న కేరళలోని కొచ్చిలో డబ్ల్యూపీఎల్ 2027 ఆటగాళ్ల వేలం జరగనుంది. ఇందులో పాల్గొనే ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లలో అవసరమైన మార్పులు చేసుకుని, బలమైన జట్లను రూపొందించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్, గత సీజన్లలో వారి ప్రదర్శనలు, జట్టుకు అవసరమైన పాత్రలను పరిగణనలోకి తీసుకుని వేలంలో ఎంపికలు చేపట్టనున్నాయి. దీంతో ఏ ఆటగాడికి ఏ జట్టు అవకాశం కల్పిస్తుంది? స్టార్ క్రికెటర్ల కోసం ఫ్రాంచైజీలు ఎంతవరకు ఆసక్తి చూపిస్తాయి? అనే అంశాలు చర్చనీయాంశంగా మారనున్నాయి. ప్రస్తుత జట్లలోని ఆటగాళ్లను కొనసాగించుకునేందుకు బీసీసీఐ సెప్టెంబర్ 28ను చివరి తేదీగా నిర్ణయించింది. ఈ గడువు నేపథ్యంలో ఐదు ఫ్రాంచైజీలు తమ జట్ల కూర్పుపై దృష్టి సారించనున్నాయి. గత సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన ఆటగాళ్లను కొనసాగించుకోవడంతో పాటు, జట్టులోని బలహీనతలను అధిగమించేందుకు అవసరమైన మార్పులు చేపట్టడం కీలకం కానుంది. రిటెన్షన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత వేలంలో ఆటగాళ్ల ఎంపిక ద్వారా జట్ల తుది కూర్పు మరింత స్పష్టతకు రానుంది. కొత్త సీజన్‌లో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగే ఫ్రాంచైజీలకు ఈ ప్రక్రియ కీలకంగా మారనుంది. 2023లో ప్రారంభమైన మహిళల ప్రీమియర్ లీగ్ తక్కువ సమయంలోనే ప్రపంచ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. భారత్‌తో పాటు వివిధ దేశాలకు చెందిన ప్రముఖ క్రికెటర్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు యువ క్రీడాకారిణులకు కూడా ఈ లీగ్ అవకాశాలు కల్పిస్తోంది. వివిధ దేశాల ఆటగాళ్లు ఒకే జట్టులో కలిసి ఆడటం ద్వారా అనుభవాన్ని పంచుకోవడంతో పాటు ఆటలో కొత్త నైపుణ్యాలను నేర్చుకునే అవకాశం లభిస్తోంది. మహిళా క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తిని పెంచడం, ఆటగాళ్లకు మెరుగైన పోటీ వాతావరణాన్ని కల్పించడం వంటి అంశాల్లో డబ్ల్యూపీఎల్ కీలక పాత్ర పోషిస్తోంది. డబ్ల్యూపీఎల్ ఇప్పటివరకు నిర్వహించిన నాలుగు ఎడిషన్లలో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు రెండేసి టైటిళ్లు సాధించాయి. 2026 సీజన్‌లో స్మృతి మంధాన నాయకత్వంలోని ఆర్సీబీ రెండోసారి చాంపియన్‌గా నిలిచింది. గత సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలో నిర్వహించారు. ఈ రెండు జట్లు ఇప్పటికే తమ సత్తా చాటగా, మిగిలిన ఫ్రాంచైజీలు కూడా టైటిల్ పోటీలో ముందంజ వేయాలని భావిస్తున్నాయి. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం, జట్ల కూర్పులు పోటీ స్వరూపాన్ని ప్రభావితం చేయనున్నాయి. సాధారణంగా మార్చి ఆరంభంలో జరిగే డబ్ల్యూపీఎల్ ఈసారి జనవరి మధ్యలోనే ప్రారంభం కానుంది. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు సాగే టోర్నీలో ఐదు జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. మ్యాచ్‌ల వేదికలపై బీసీసీఐ నుంచి మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఆటగాళ్ల వేలం పూర్తయి జట్ల కూర్పులు ఖరారైన తర్వాత కొత్త సీజన్‌పై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. డిఫెండింగ్ చాంపియన్ ఆర్సీబీ టైటిల్‌ను నిలబెట్టుకుంటుందా? ముంబై ఇండియన్స్ మరోసారి ఆధిపత్యం చాటుతుందా? లేక మరో జట్టు విజేతగా అవతరిస్తుందా? అన్నది 2027 సీజన్‌లో తేలనుంది.



ఏఐటీఏ ఎన్నికల్లోకి సానియా, భూపతి

లియాండర్ పేస్ అధ్యక్ష ఆశలకు గండి!

ఎస్ఓఎం ప్రతినిధుల ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేసిన సానియా, మహేశ్ భూపతి

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ వర్గాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశ టెన్నిస్ క్రీడా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిన దిగ్గజ క్రీడాకారులు సానియా మీర్జా, మహేశ్ భూపతి అఖిల భారత టెన్నిస్ సంఘం పరిపాలనలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వారు ఏఐటీఏలో 'స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ అవుట్‌స్టాండింగ్ మెరిట్' ప్రతినిధుల ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేశారు. మరోవైపు, ఏఐటీఏ అధ్యక్ష పదవిని ఆశించిన మరో లెజెండరీ టెన్నిస్ ఆటగాడు లియాండర్ పేస్ అనూహ్యంగా ఈ రేసు నుంచి వెనుకంజ వేయాల్సి వచ్చింది. ఏఐటీఏ సవరించిన నిబంధనల ప్రకారం.. అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే అభ్యర్థి కచ్చితంగా ఎస్ఓఎం ప్రతినిధిగా ఎన్నికై ఉండాలి లేదా గతంలో కార్యవర్గంలో పనిచేసిన అనుభవం ఉండాలి. ఈ రెండు అర్హతలు లేని లియాండర్ పేస్‌కు ఎస్ఓఎం ఎన్నికల ద్వారా అర్హత సాధించడం ఒక్కటే మార్గం. అయితే, ఆయన ఎస్ఓఎం ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు. గతంలో బెంగాల్ టెన్నిస్ సంఘం పేస్‌ను అధ్యక్ష అభ్యర్థిగా బలపరిచినప్పటికీ, ఈ నిబంధనల పేచీ కారణంగా ఆయన ఆశలకు గండిపడింది.

బరిలో ప్రముఖ మాజీ ఆటగాళ్లు:

ఎస్ఓఎం ప్రతినిధుల ఎన్నికల కోసం సానియా మీర్జా, మహేశ్ భూపతితో పాటు అంకితా భాంబ్రి, ప్రస్తుత డేవిస్ కప్ కోచ్ ఆశుతోష్ సింగ్, విశాల్ ఉప్పల్, గౌరవ్ నాటేకర్, జాన్కీ కృష్ణమూర్తి, శాలిని ఠాకుర చావల సహా మొత్తం 8 మంది మాజీ క్రీడాకారులు నామినేషన్లు దాఖలు చేశారు. క్రీడా సమాఖ్యల నిర్వహణలో అత్యున్నత స్థాయిలో రాణించిన మాజీ ఆటగాళ్లకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం నలుగురు ఎస్ఓఎం ప్రతినిధులను జనరల్ బాడీకి, ఇద్దరిని ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నుకోనున్నారు. ఈ పరిణామంపై స్పందించిన మహేశ్ భూపతి.. ప్రతి క్రీడా సమాఖ్యకు ఉన్నత స్థాయిలో ఆడిన ఆటగాళ్ల సేవలు ఎంతో అవసరమని తెలిపారు. బ్యాడ్మింటన్‌లో పుల్లేల గోపీచంద్ తీసుకువచ్చిన మార్పులే దీనికి చక్కటి ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. కాగా, నవంబర్ 7న ఎస్ఓఎం ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 27న ఏఐటీఏ ప్రధాన ఎన్నికలు నిర్వహించనున్నారు.

టీ20 క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు

- తొలి జట్టుగా టీమిండియా!
- అంతర్జాతీయ టీ20ల్లో 200 విజయాలు సాధించిన మొదటి టీమ్‌గా భారత్ రికార్డు
- న్యూజిలాండ్‌పై విజయంలో మెరిసిన తెలుగు ఆణిముత్యాలు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి



క్రిస్ట్‌చర్చ్, అక్టోబర్ 26: అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో భారత్ మరో అపూర్వమైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 విజయాలు సాధించిన తొలి జట్టుగా టీమిండియా చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించడం ద్వారా భారత్ ఈ మైలురాయిని అందుకుంది. కాగా, భారత్‌కు ఇది 300వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కావడం విశేషం. టీమిండియా ఇప్పటివరకు ఆడిన 300 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 200 విజయాలు సాధించగా, 83 మ్యాచ్‌లలో ఓటమి పాలైంది. మరో ఏడు మ్యాచ్‌లు టైగా ముగియగా, 10 మ్యాచ్‌లలో ఎలాంటి ఫలితం తేలలేదు. దీంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 విజయాల మైలురాయిని అందుకున్న ప్రపంచంలోని తొలి జట్టుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ రికార్డు జాబితాలో పాకిస్థాన్ 176 విజయాలతో రెండో స్థానంలో కొనసాగుతుండగా, న్యూజిలాండ్ 135, దక్షిణాఫ్రికా 129, ఇంగ్లండ్ 128, ఆస్ట్రేలియా 127 విజయాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుత టీమిండియా ఫామ్ చూస్తుంటే ఈ విజయాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

తెలుగు ఆటగాళ్ల అసాధారణ పోరాటం

న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. మ్యాచ్‌లో భాగంగా 181 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా, ఒక దశలో కేవలం 70 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో పడింది. మ్యాచ్ కివీస్ వశమవుతుందని భావిస్తున్న తరుణంలో, తెలుగు ప్లేయర్స్ తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగిపోయి జట్టును విజయతీరాలకు చేర్చారు. యువ ఆటగాడు తిలక్ వర్మ కేవలం 26 బంతుల్లోనే 51 పరుగులు చేసి అజేయంగా నిలవగా, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కేవలం 13 బంతుల్లోనే 26 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇద్దరూ కలిసి ఏడో వికెట్‌కు అజేయమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు. చివరి వరకు పట్టువదలక పోరాడిన భారత జట్టు 19.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 181 పరుగులు సాధించి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది.

నాలుగేళ్ల తర్వాత రీఎంట్రీ

తడబడుతున్న భువీకి బౌలింగ్ కోచ్ మోర్కెల్ విలువైన సూచనలు!

భువనేశ్వర్‌కు మోర్కెల్ అండ : బయటి విమర్శలు పట్టించుకోవద్దని సూచన



వెల్లింగ్టన్, అక్టోబర్ 26: న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తడబడుతున్నా.. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అతడికి అండగా నిలిచాడు. బయటి నుంచి వచ్చే విమర్శలు, అంచనాల గురించి ఆలోచించకుండా తన సహజశైలిలో బౌలింగ్ చేయాలని సూచించాడు. ఒక్కో మ్యాచ్‌తో లయ అందుకుంటాడని ధీమా వ్యక్తం చేశాడు. నాలుగేళ్ల విరామం తర్వాత భారత టీ20 జట్టులోకి తిరిగొచ్చిన భువనేశ్వర్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో సాగలేదు. న్యూజిలాండ్‌తో తొలి రెండు టీ20ల్లో తన కోటా ఓవర్లలో వరుసగా 49, 50 పరుగులు సమర్పించుకున్నాడు. 12.37 ఎకానమీతో భారత బౌలర్లలో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా నిలిచాడు. మంగళవారం జరగనున్న మూడో టీ20కి ముందు మోర్కెల్ మీడియాతో మాట్లాడాడు. నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగొచ్చిన ఆటగాడిపై అంచనాలు ఎక్కువగా ఉంటాయని, వాటిని పక్కన పెట్టాలని భువనేశ్వర్‌కు చెప్పినట్లు వెల్లడించాడు. ఐపీఎల్‌లో అతడు అద్భుతంగా రాణించాడని, అయితే అంతర్జాతీయ క్రికెట్ పూర్తిగా భిన్నమని పేర్కొన్నాడు. జాతీయ జట్టులోకి ఎంపికయ్యే ముందు భువనేశ్వర్‌కు సాధన చేసేందుకు నెల రోజుల సమయం మాత్రమే లభించిందని మోర్కెల్ వివరించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో చిన్న పొరపాట్లకూ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. అతడి నైపుణ్యం, అనుభవంపై తనకు నమ్మకం ఉందన్నాడు. కొన్ని మ్యాచ్‌ల్లో స్థిరపడేందుకు సమయం ఇవ్వాలని సూచించాడు. గత రెండు ఐపీఎల్ సీజన్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున భువనేశ్వర్ 45 వికెట్లు పడగొట్టాడు. ఆ జట్టు టైటిల్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. కొత్త బంతితో అతడి బౌలింగ్, అనుభవం జాతీయ జట్టులోకి తిరిగి వచ్చేలా చేశాయి. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలో ఉంది. మూడో మ్యాచ్‌కు వెల్లింగ్టన్‌లో వీచే బలమైన గాలులు సవాల్‌గా మారనున్నాయని మోర్కెల్ అన్నాడు. పరిస్థితులను సాకుగా చూపకుండా, సవాలును ఎదుర్కొనేందుకు జట్టు సిద్ధంగా ఉందని స్పష్టం చేశాడు.

ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్..

అంపైర్ వివాదాస్పద నిర్ణయానికి దేవదత్ పడిక్కల్ బలి!

లింకన్, అక్టోబర్ 26: న్యూజిలాండ్‌లోని లింకన్ వేదికగా భారత్ 'ఏ', న్యూజిలాండ్ 'ఏ' జట్ల మధ్య జరుగుతున్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, కేవలం ఒక్క పరుగు తేడాతో (199 పరుగుల వద్ద) తృటిలో డబుల్ సెంచరీని చేజార్చుకున్నాడు. అతను ఔటైన తీరు మైదానంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫీల్డ్ అంపైర్ ఇచ్చిన వివాదాస్పద కాట్ బిహైండ్ నిర్ణయంపై పడిక్కల్ ఆశ్చర్యం, అసంతృప్తి వ్యక్తం చేశాడు. న్యూజిలాండ్ 'ఏ' ఆటగాళ్లు చేసిన అప్పీల్‌లో పెద్దగా బలం లేనప్పటికీ, అంపైర్ వేలు పైకెత్తడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇన్నింగ్స్ 78వ ఓవర్‌లో కివీస్ బౌలర్ జాక్ గిబ్సన్ వేసిన లెగ్ సైడ్ సాధారణ లెంగ్త్ డెలివరీని ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన పడిక్కల్ ఫ్లిక్ చేయడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో బంతి బ్యాట్‌కు కాకుండా ప్యాడ్‌ను తాకుతూ వెళ్లి వికెట్ కీపర్ మిచెల్ హే గ్లోవ్స్‌లో పడింది. క్రికెట్ నిబంధనల ప్రకారం బంతి బ్యాట్‌ను తాకకుండా కేవలం ప్యాడ్‌ను తాకి వికెట్ కీపర్ వద్దకు వెళితే అది నాటౌట్. ఆ సమయంలో బంతి ప్యాడ్‌కే తగిలిందని పడిక్కల్ గట్టిగా భావించాడు. కానీ అంపైర్ మాత్రం బంతి బ్యాట్‌కు తగిలిందని భావిస్తూ ఔట్‌గా ప్రకటించాడు. అంపైర్ నిర్ణయంతో షాకైన పడిక్కల్.. బంతి బ్యాట్‌కు ఎంత దూరంలో ఉందో, ప్యాడ్‌కు ఎలా తగిలిందో తన హావభావాల ద్వారా అంపైర్‌కు వివరించే ప్రయత్నం చేశాడు. కానీ ఫలితం లేకపోవడంతో నిరాశతో మైదానాన్ని వీడాడు.

అసలేం జరిగిందంటే..

దురదృష్టవశాత్తూ పడిక్కల్ డబుల్ సెంచరీ మిస్ అయినప్పటికీ, అతను ఆడిన ఇన్నింగ్స్ చరిత్రలో నిలిచిపోయింది. కేవలం 248 బంతుల్లో 24 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో ఏకంగా 199 పరుగులు బాదాడు. దీంతో ఇండియా 'ఏ' చరిత్రలోనే ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన బ్యాటర్‌గా పడిక్కల్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇండియా 'ఏ' తరఫున పడిక్కల్‌కు ఇది మూడో సెంచరీ కాగా, ఈ ఇన్నింగ్స్ ద్వారానే భారత్ 'ఏ' తరఫున 1000 పరుగుల మైలురాయిని కూడా విజయవంతంగా అధిగమించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 113 పరుగులకే కుప్పకూలగా, న్యూజిలాండ్ 317 పరుగులు చేసి 204 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకుంది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లోనూ 10 పరుగులకే యశస్వి జైస్వాల్ (5), కేఎల్ రాహుల్ (4)ల వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన దశలో పడిక్కల్, సాయి సుదర్శన్ జట్టును ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 215 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. సాయి సుదర్శన్ 91 పరుగులు చేయగా.. ఆ తర్వాత యశ్ రాథోడ్ (66), వాషింగ్టన్ సుందర్ (నాటౌట్ 51) అర్ధ శతకాలతో రాణించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 488 పరుగుల భారీ స్కోరు సాధించి.. మ్యాచ్‌లో 284 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.





జైలర్–2.. తెలుగులోనే 100 కోట్లు!

బాక్సాఫీస్ దగ్గర 'తలైవా' సునామీ సృష్టిస్తున్నారు. వయసుతో పనేలేదని, వెండితెరపై తన మేనియా ఎప్పటికీ తగ్గదని నిరూపిస్తూ సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన విశ్వరూపం చూపించారు. ఆయన నటించిన లేటెస్ట్ సెన్సేషన్ 'జైలర్ 2' బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసింది. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌లో ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 100 కోట్ల గ్రాస్ మార్కును దాటేసి సరికొత్త సంచలనానికి తెరతీసింది. ఒక తమిళ హీరో సినిమా డబ్బింగ్ వెర్షన్ తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ఈ స్థాయిలో విధ్వంసం సృష్టించడం ట్రేడ్ పండితులనే ఆశ్చర్యపరుస్తోంది. చాలామంది డబ్బింగ్ హీరోల సినిమాలు వస్తుంటాయి పోతుంటాయి.. కానీ రజనీకాంత్ వస్తే ఆ వైబ్రేషనే వేరు. తెలుగు ఆడియన్స్ ఆయన్ను ఎంతగా సొంతం చేసుకున్నారో 'జైలర్ 2' వసూళ్లు మరోసారి కళ్లకు కట్టాయి. మొదటి రోజే వచ్చిన పాజిటివ్ టాక్‌తో థియేటర్లన్నీ హౌస్‌ఫుల్ బోర్డులతో దద్దరిల్లిపోయాయి. ఈ వంద కోట్ల మార్క్‌తో రజనీకాంత్ సౌత్ ఇండియాలోనే అరుదైన మైలురాయిని చేరుకున్నారు. కేవలం తెలుగు వెర్షన్ ద్వారానే నాలుగు సార్లు రూ. 100 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఏకైక తమిళ హీరోగా రికార్డులకెక్కారు. ఇతర భాషా స్టార్లకు తెలుగులో ఒకట్రెండు సినిమాలు ఆడటం చూశాం.. కానీ నాలుగు సార్లు సెంచరీ కొట్టడం ఒక్క రజనీకాంత్‌కే చెల్లిందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్క్రీన్‌పై రజినీ స్వాగ్, నెల్సన్ స్టైలిష్ మాస్ టేకింగ్, థియేటర్లలో ఈలలు వేయించే యాక్షన్ సీన్స్ తెలుగు ప్రేక్షకులకు పూనకాలు తెప్పించాయి. బాక్సాఫీస్ దగ్గర రజినీ ర్యాంపేజ్ ఇంకా కొనసాగుతుండటంతో ఫుల్ రన్‌లో 'జైలర్ 2' మరిన్ని పాత రికార్డులను బద్దలు కొట్టడం ఖాయంగా కనిపిస్తోందని అంటున్నారు.



అజిత్ హీరోయిన్‌గా కయాదు లోహర్?

తమిళ స్టార్ హీరో అజిత్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఆయన నటించనున్న 64వ చిత్రానికి 'డేర్ డెవిల్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నవంబర్ 2 నుంచి షూటింగ్ ప్రారంభం కానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత అజిత్ మరోసారి దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో కలిసి పనిచేయనున్నారు. నిర్మాతల విషయంలో నెలకొన్న సందిగ్ధత, అజిత్ కార్ రేసింగ్ కార్యక్రమాల కారణంగా ఈ సినిమా ఆలస్యమైంది. ఈ చిత్రానికి అజిత్ స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మొదట హీరోయిన్‌గా శ్రీలీల పేరు వినిపించినప్పటికీ, ఆమె ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా ఆమె స్థానంలో కయాదు లోహర్ నటించనున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. అయితే చిత్ర బృందం దీనిపై అధికారికంగా స్పందించలేదు. మరోవైపు అధిక్ రవిచంద్రన్ తన సినిమాల్లో హీరోయిన్ పాత్రకు 'రమ్య' అనే పేరు పెట్టడం ప్రత్యేకతగా కొనసాగుతోంది. 'డేర్ డెవిల్'లోనూ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? కయాదు లోహర్ హీరోయిన్‌గా ఖరారవుతారా? అన్నది అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టత రానుంది.

మా వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దు: రష్మిక



విజయ్ దేవరకొండతో తన వైవాహిక బంధంపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలకు నటి రష్మిక స్పందించారు. తమ వ్యక్తిగత జీవితంపై పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఊహాగానాలు చేయొద్దని, ఎడిట్ చేసిన వీడియోలు, అసంపూర్ణ సమాచారంతో తీర్పులు ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు. ఇటీవల 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో పాల్గొన్న విజయ్.. రష్మిక తనను పెళ్లి చేసుకోమని వందసార్లు అడిగిందని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విజయ్‌ను విమర్శిస్తూ నెట్టింట పోస్టులు రావడంతో రష్మిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. పెళ్లి విషయంలో నిర్ణయం తీసుకోవడానికి విజయ్ సమయం తీసుకోవడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకుని, జీవితంలోని కష్టసుఖాలను కలిసి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామో తెలుసుకోవడం ముఖ్యమని రష్మిక అన్నారు. విజయ్‌పై తనకు ఎంతో ప్రేమ ఉందని, ఇద్దరూ పరస్పర అంగీకారంతో ఒకరినొకరు జీవిత భాగస్వాములుగా ఎంచుకున్నామని తెలిపారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు విజయ్ అండగా నిలిచారని, ఇప్పటికీ ఆ మద్దతు కొనసాగుతోందని వెల్లడించారు. ప్రస్తుతం తన జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నానని పేర్కొంటూ, తమ కుటుంబం గురించి తెలియకుండా ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం వేధింపులతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా తనను ఆదరిస్తున్న అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.



రవిబాబు హారర్ సినిమాలో బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్!

టాలీవుడ్‌లో ఓ క్రేజీ కాంబినేషన్ తెరపైకి వచ్చింది. వైవిధ్యమైన కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవిబాబు.. ఓ హారర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అదే నిజమైతే దాదాపు 17 ఏళ్ల తర్వాత కంగనా మళ్లీ తెలుగు తెరపై కనిపించనున్నట్టే! విభిన్నమైన కథాంశాలు, విలక్షణమైన మేకింగ్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం దర్శకుడు రవిబాబు శైలి. ఇటీవల 'రేజర్'తో వార్తల్లో నిలిచిన ఆయన.. ఇప్పుడు హారర్ జానర్‌లో మరో ప్రయోగానికి సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్టులో కంగనా రనౌత్ నటించనున్నారనే ప్రచారం ఈ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా సాగుతోందని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తల్లో నిజమెంత? కంగనా నిజంగానే రవిబాబు సినిమాలో నటిస్తున్నారా? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు అధికారిక సమాధానం లేదు. కంగనా రనౌత్‌కు తెలుగు ప్రేక్షకులతో గతంలోనే పరిచయం ఉంది. ప్రభాస్ కథానాయకుడిగా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏక్ నిరంజన్'లో ఆమె కథానాయికగా నటించారు. ఆ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమైన కంగనా.. ఆ తర్వాత మరో తెలుగు చిత్రంలో కనిపించలేదు. ఇప్పుడు రవిబాబు హారర్ సినిమాలో ఆమె నటిస్తున్నారనే ప్రచారం నిజమైతే, దాదాపు 17 ఏళ్ల విరామం తర్వాత టాలీవుడ్‌లోకి ఆమె రీఎంట్రీ ఇచ్చినట్లవుతుంది. బాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు సంపాదించిన కంగనా.. హారర్ కథలో ఎలాంటి పాత్రలో కనిపిస్తారనే అంశం ఆసక్తికరంగా మారుతుంది. కంగనా రనౌత్ తదుపరి చిత్రాల గురించి ఇప్పటికే పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఓ తెలుగు సినిమాలో నటించనున్నారనే ప్రచారం అభిమానుల్లో చర్చకు దారితీసింది. అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ చిత్రానికి సంబంధించి కంగనా ఎంపిక, కథ, పాత్ర, షూటింగ్ వివరాలపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు. ఓవైపు విలక్షణ దర్శకుడు రవిబాబు.. మరోవైపు బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్.. ఈ ఇద్దరి కలయిక నిజమైతే సినిమాపై సహజంగానే భారీ ఆసక్తి ఏర్పడుతుంది. కానీ ప్రస్తుతం ఈ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలకు అధికారిక ధ్రువీకరణ లేదు. కంగనా బృందం లేదా చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడితేనే ఈ ప్రాజెక్టుపై స్పష్టత రానుంది. అప్పటివరకు ఈ క్రేజీ కాంబినేషన్‌ను ఆసక్తికరమైన ప్రచారంగానే చూడాలి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com